ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 137, పేజీలు - 08

బుధవారం, నవంబర్ 18, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వండి

ఛత్తీస్‌గఢ్ సీఎంను కోరిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి

- రాయ్‌పూర్‌లో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల కీలక భేటీ
- సమ్మక్క సాగర్ ప్రాజెక్టు ఎన్ఓసీ మంజూరుపై ఛత్తీస్‌గఢ్ సీఎం సానుకూల స్పందన
- తుపాకులగూడెం వద్ద ఇప్పటికే పూర్తయిన బ్యారేజీ నిర్మాణం
- నిబంధనల ప్రకారం పరిహారం, పునరావాస నిధులు ఇచ్చేందుకు తెలంగాణ సిద్ధం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో గోదావరి జలాల వినియోగానికి కీలకమైన సమ్మక్క సాగర్ బ్యారేజీకి సంబంధించి మరో ముందడుగు పడింది. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. మంగళవారం రాయ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి రేవంత్ రెడ్డి ఈ అంశాన్ని ప్రస్తావించారు. తెలంగాణ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన విష్ణుదేవ్ సాయి, ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల కారణంగా రానున్న కాలంలో తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి వివరించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టుకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న ఇతర అనుమతుల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రాజెక్టు కారణంగా ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించడంతో పాటు భూసేకరణ, పునరావాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం సమకూర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తాలుత కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే ఆ ప్రాంతంలో సుమారు 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. దీనివల్ల 17 ఆదివాసీ గ్రామాలతో పాటు భద్రత, మౌలిక సదుపాయాలపై ప్రభావం పడే ప్రమాదం ఉందని గుర్తించారు. ఈ సమస్యలను తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. కొత్త ప్రాంతంలో నిర్మాణం చేపట్టినప్పటికీ ఛత్తీస్‌గఢ్ భూభాగంలో బ్యాక్‌వాటర్ ప్రభావం ఎంత ఉంటుందన్నది రెండు రాష్ట్రాల మధ్య కీలక అంశంగా మారింది.ఈ నేపథ్యంలో పొరుగురాష్ట్రం కోరిన మేరకు ఐఐటీ ఖరగ్‌పూర్‌తో అధ్యయనం చేయించారు. ఆ రిపోర్ట్ ప్రకారం సాధారణంగా పూర్తిస్థాయి నీటిమట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలంగాణ ప్రభుత్వం వివరించింది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని తెలిపింది. బ్యాక్‌వాటర్ ప్రభావం, ముంపు ప్రాంతాలపై సమగ్ర అధ్యయనం

2లో..

పోటీ కాదు, సహకారమే

మన భవిష్యత్తు

- ఆసియాన్ సదస్సులో ప్రధాని మోదీ



ఆసియాన్ దేశాలు కలిస్తే ప్రపంచ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఉంటాయని మోదీ గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మన భవిష్యత్తును పోటీతో కాకుండా సహకారంతో తీర్చిదిద్దుకోవడం చాలా అవసరమన్నారు. రాబోయే సంవత్సరాల్లో 'వికసిత భారత్ 2047', 'ఆసియాన్ కమ్యూనిటీ విజన్ 2045' మన ఉమ్మడి ఆకాంక్షలను సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్ అభివృద్ధి, ఆసియాన్ దేశాల శ్రేయస్సు ఒకదానితో ఒకటి గాఢంగా ముడిపడి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇరుపక్షాల భవిష్యత్తును పోటీతత్వం కాకుండా సహకారం నిర్దేశించాలని ఆయన పిలుపునిచ్చారు. మనీలాలో జరిగిన 23వ ఇండియా-ఆసియాన్ సదస్సులో మోదీ ప్రసంగించారు. భారత్, గత కొన్నేళ్లుగా తమ 'యాక్ట్ ఈస్ట్' విధానం భారత్-ఆసియాన్ సంబంధాలకు కొత్త ఊపునిచ్చిందని మోదీ తెలిపారు. తమ భాగస్వామ్యం కేవలం

2లో..

అభయహస్తం కాస్తా

శూన్యహస్తమైంది

- కాంగ్రెస్ మేనిఫెస్టోను మోసాల చిట్టాగా అభివర్ణించిన హరీష్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ మేనిఫెస్టోకు మూడేళ్లు కాగా, అధికారంలోకి వచ్చి ఆ పార్టీ చేస్తున్న నయవంచనకు మూడేళ్లు అవుతుందని తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు అధికారం కోసం ఎన్నికల కోసం గొప్పగా చెప్పుకున్న అభయహస్తం హామీలను అమలు చేయని మొండి హస్తంగా మారిందని ఎద్దేవా చేశారు. మేనిఫెస్టో అంటే మాకు భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని, అందులో పేర్కొన్న హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తామని మూడేళ్ల క్రితం ఇదే రోజు మల్లికార్జున ఖర్గే సమక్షంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీష్ రావు గుర్తు చేశారు. మూడేళ్లు గడిచినా కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు దిక్కులేదు. అమలు ఊసే లేదని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆ అభయ హస్తం శూన్య హస్తం

2లో..

తెలంగాణ ఆర్థిక వసూళ్లలో ఆసక్తికర గణాంకాలు

- ఆదాయంలో హైదరాబాద్ టాప్.. ఖర్చులో రంగారెడ్డి!



తెలంగాణ రాష్ట్రంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి ఆరు నెలల ఆదాయ, వ్యయాల గణాంకాలు జిల్లాలవారీగా కీలకమైన అంశాలను వెల్లడించాయి. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరు నెలల ఆదాయ, వ్యయాల గణాంకాలు ఆసక్తికరంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి సమకూరే రెవెన్యూ వసూళ్లలో రాజధాని హైదరాబాద్

2లో..

రాయలసీమ 'హార్టికల్చర్ హబ్'పై

స్పెషల్ ఫోకస్

- నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ



న్యూఢిల్లీ / అమరావతి (ప్రశ్న న్యూస్) రెండు భారీ తుఫాన్ల తాకిడితో పంటలు సహా వివిధ రంగాలకు భారీ నష్టం సంభవించిందని రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయాన్ని అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో మంగళవారం భేటీ అయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఇటీవల సంభవించిన వరుస తుఫాన్లు, హార్టికల్చర్ హబ్, పూర్వోదయ నిధులు విడుదల, ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు వంటి అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. అలాగే విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు, ఆ సదస్సు వేదికగా తీసుకున్న నిర్ణయాలపై ముఖ్యమంత్రి-కేంద్ర ఆర్థిక మంత్రి భేటీలో ప్రస్తావనకు వచ్చింది. ఈ భేటీ సందర్భంగా రాష్ట్రాన్ని ఇటీవల కాలంలో తాకిన ఆర్నబ్, మురసు తుఫాన్ల వల్ల కలిగిన నష్టం గురించి సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి వివరించారు.

2లో..

అక్వాన్ తుఫాన్ పట్ల

అత్యంత అప్రమత్తత అవసరం

- ఎలాంటి ప్రాణనష్టం జరగకూడదన్న పవన్ కల్యాణ్



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంపై మరో ప్రకృతి విపత్తు విరుచుకుపడే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు రక్షణ చర్యలను ముమ్మరం చేసింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అక్వాన్ తుపాను ప్రభావం రానున్న రోజుల్లో రాష్ట్రంపై తీవ్రంగా ఉండనుందన్న హెచ్చరికల నేపథ్యంలో, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా (ఆర్.డబ్ల్యూ.ఎస్) విభాగాల అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో

2లో..

ఒంటెద్దు పోకడలతో ఇంటర్ బోర్డు రద్దు చేస్తామంటే ఒప్పుకోం

- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత ఫైర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో ఇంటర్మీడియట్ బోర్డు రద్దు అంశంపై ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే సహించేది లేదు అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. విద్యావ్యవస్థలో కీలక మార్పులు చేపట్టే ముందు మేధావులు, విద్యావేత్తలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, పారశాలలు, కళాశాలల యాజమాన్యాలతో విస్తృతంగా చర్చించాలని అందరికీ ఆమోదయోగ్యం అయిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు.సోమాజిగూడలో నిర్వహించిన 'ఇంటర్ బోర్డు రద్దు - తెలంగాణ విద్యపై ప్రభావం' రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న విద్యావిధానంలో మార్పులు తీసుకొచ్చేటప్పుడు అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని కవిత వ్యాఖ్యానించారు.అయితే ప్రభుత్వం వద్దకు ఎవరైనా తమ అభిప్రాయాలు చెప్పేందుకు వెళితే ఎదురుదాడి చేసే పరిస్థితి ఉందని, అందుకే విద్యావేత్తలు, మేధావుల అభిప్రాయాలను ఒక వేదికపైకి తీసుకురావడానికి తామే రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత అన్నారు.

డ్రాప్ ఔట్లపై సీఎం లెక్కలు తప్పు

ఇంటర్ బోర్డు రద్దుకు డ్రాప్‌అవుట్లే ప్రధాన కారణమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్తున్న లెక్కలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత అసహనం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దగ్గర ఉన్న లెక్కలు తప్పుడు లెక్కలు అని అభిప్రాయపడ్డారు.

2లో..

హైదరాబాద్‌లో

కల్తీ మద్యం దందా

- ఖరీదైన బ్రాండెడ్ బాటిళ్లలో చీప్ లిక్కర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మందుబాబులకు షాకిచ్చే కల్తీ మద్యం దందా హైదరాబాద్‌లో వెలుగులోకి వచ్చింది. ఖరీదైన బ్రాండ్ల మద్యం బాటిళ్లలో చౌక లిక్కర్ నింపి అసలైన మద్యంలా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన ఇంటినే కల్తీ మద్యం తయారీ కేంద్రంగా మార్చుకున్నట్లు గుర్తించారు. స్క్రాప్ దుకాణం నుంచి

2లో..

ఐపీఎల్‌కు

ఎంఎస్ ధోనీ బైబై

- సీఎస్కే మెంటార్‌గా కొత్త ఇన్నింగ్స్‌కు శ్రీకారం

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్‌కు ఎంఎస్ ధోని రిటైర్మెంట్ ప్రకటించాడు. ఐపీఎల్ 2027 నుంచి చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు మెంటార్‌గా ధోని కొత్త అధ్యాయాన్ని ప్రారంభించనున్నాడు. ధోనీ ఐపిఎల్ కెరీర్ ముగింపుపై సీఎస్కే మేనేజ్‌మెంట్ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. చెన్నై సూపర్ కింగ్స్ యజమాని ఎన్. శ్రీనివాసన్ మాట్లాడుతూ ఎంఎస్ ధోని లేకుండా సీఎస్‌కే లేదని చెప్పాలి. దాదాపు 2 దశాబ్దాలుగా విజయాలు, ఎదురుదెబ్బలతో పాటు అన్ని ఒడిదుడుకులలో ఒకరికొకరు తోడుగా నడిచాము. దాంతో ధోనీతో మా బంధం ఇంత బలంగా ఉండటానికి కారణం మేము ఇతరుల అభిప్రాయాల్ని ప్రశ్నించుకోం. ఆ నమ్మకమే ఈ ప్రయాణాన్ని సాధ్యం చేసిందని' అన్నారు. ధోనీ కెప్టెన్సీలో సీఎస్కే 5 ఐపీఎల్ ట్రోఫీలు (2010, 2011, 2018, 2021 మరియు 2023) సాధించిందని తెలిసిందే. జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వచ్చే ఆటగాడు ధోనీ.

2లో..

స్వీట్లపై వెండి రేకు కాదు..

అల్యూమినియం!

- పోలీసుల దాడుల్లో సంచలన విషయాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో ప్రజల ఆహార భద్రతకు ముప్పు కలిగించే మరో అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. స్వీట్లు, పాన్‌లు, ఇతర ఆహార పదార్థాలపై అలంకరణ కోసం ఉపయోగించే స్వచ్ఛమైన వెండి రేపర్స్ స్థానంలో అల్యూమినియం రేకులను వినియోగిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. నగరంలో రహస్యంగా నకిలీ సిల్వర్ వర్క్ తయారు

2లో..

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వండి

నిర్వహించేందుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9.883 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించింది. ఐఐటీ ఖరగ్‌పూర్ తన అధ్యయన నివేదికను జూలై 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ఆధారంగా ముంపు ప్రభావంపై ఉన్న అభ్యంతరాలను పరిష్కరించి ఎన్ఓసీ జారీ చేయాలని తెలంగాణ కోరుతోంది. ప్రభావిత భూములకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మరోసారి స్పష్టం చేసింది.సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి అయినప్పటికీ దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడానికి అంతర్రాష్ట్ర అనుమతులు కీలకంగా మారాయి. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ)లోని పలు విభాగాల నుంచి ప్రాజెక్టుకు సంబంధించి అనుమతులు లభించినప్పటికీ ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్ఓసీ లేకపోవడంతో అంతర్రాష్ట్ర అంశాల పరిశీలన ముందుకు సాగడం లేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అభ్యంతరాల కారణంగా సీడబ్ల్యూసీ సాంకేతిక సలహా కమిటీకి తన సిఫారసును పంపడంలో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. అందువల్ల ఛత్తీస్‌గఢ్ నుంచి అనుమతి లభిస్తే ప్రాజెక్టు తదుపరి క్లియరెన్సుల ప్రక్రియకు మార్గం సుగమం కానుంది.ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం సమీపంలో గోదావరి నదిపై ఈ సమ్మక్క సాగర్ బ్యారేజీని నిర్మించారు. సుమారు 1,143 మీటర్ల పొడవు, 59 రేడియల్ గేట్లతో నిర్మించిన ఈ బ్యారేజీకి పూర్తి స్థాయి నీటిమట్టం +83 మీటర్ల వద్ద 6.94 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉంది. దీని ద్వారా గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని మళ్లించే ప్రణాళిక ఉంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో దశ కింద సుమారు 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం, రామప్ప–పాకాల లింక్ కెనాల్ కింద మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశాలు. దేవాదుల ఎత్తిపోతల పథకం ఆయకట్టుకు కూడా నీటి లభ్యత మెరుగుపడే అవకాశం ఉంది. సాగుతో పాటు మార్గమధ్యంలోని ప్రాంతాలకు తాగునీటి అవసరాలు తీర్చడంలోనూ ఈ బ్యారేజీ ఉపయోగపడుతుందని అంచనా వేస్తున్నారు.సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ కోసం తెలంగాణ ప్రభుత్వం గత కొంతకాలంగా ప్రయత్నాలు చేస్తోంది. 2025 సెప్టెంబర్‌లోనూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కలిసి ఈ అంశంపై చర్చించారు. ఈ ఏడాది జూన్‌లో కూడా ఆయన మరోసారి ఎన్ఓసీ ఇవ్వాలని కోరారు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా రాయ్‌పూర్‌కు వెళ్లి చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల నవంబర్ 15వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఢిల్లీలో జరిగిన సమావేశంలోనూ ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ నుంచి అనుమతి ఇప్పించాలని సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

పోటీ కాదు, సహకారమే మన భవిష్యత్తు

సాంస్కృతిక వారసత్వానికే పరిమితం కాకుండా, డిజిటల్, రక్షణ, అంతరిక్షం వంటి కొత్త రంగాల్లోకి విస్తరిస్తోందని వివరించారు. 2014 నుంచి ప్రజా సంబంధాలను బలోపేతం చేసేందుకు 100కు పైగా కార్యక్రమాలు చేపట్టామని, 250 క్విక్ ఇంపాక్ట్ ప్రాజెక్టులు ప్రారంభించామని, 10,000కు పైగా స్కిల్ బిల్డింగ్ స్కాలర్‌షిప్‌లు అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచం అనేక సంక్షోభాలను ఎదుర్కొంటోందని, శాంతి, స్థిరత్వం గతంలో కంటే ఇప్పుడు ఎంతో అవసరమని మోదీ అన్నారు. ఈ నేపథ్యంలో 'మన భవిష్యత్తును కలిసి నిర్మించుకుందాం' అనే ఈ ఏడాది సదస్సు థీమ్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఈ సందర్భంగా, సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ రొమాల్డెజ్ మార్కోస్ జూనియర్‌కు మోదీ అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు.

అభయహస్తం కాస్తా శూన్యహస్తమైంది

అయ్యిందని హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఓట్లు వేసిన ప్రజలనే కాదు, ఓట్లు వేసి దేవుళ్లను, పవిత్ర గ్రంథాలను సైతం మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేదు? అని నిలదీశారు.మల్లికార్జున ఖర్గే, రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలంగాణ ప్రజలకు ఆ హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తొలి క్యాబినెట్‌లోనే 6 గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామన్న హామీ నీటిమూటగానే మిగిలిందని, ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు జరిగినా చట్టబద్ధత ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. 'మేనిఫెస్టో పేరుతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి, హామీల అమలును గాలికొదిలేశారు. 6 గ్యారెంటీలు 420 హామీలతో ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి, అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క హామీకి తూట్లు పొడిచారు. గాంధీ పేరు చెప్పుకుని రాజకీయాలు చేసే కాంగ్రెస్ పార్టీ.. గాంధీభవన్ సాక్షిగా ఇచ్చిన హామీలు సైతం అమలు చేయలేక పోవడం సిగ్గుచేటు. కాంగ్రెస్ మోసపూరిత వైఖరి చూస్తే జాతిపిత మహాత్మా గాంధీ ఆత్మ కూడా క్షోభిస్తుంది.ప్రజల ఆశలను కాంగ్రెస్ నేతలు తమ మేనిఫెస్టో ద్వారా ఓట్లుగా మార్చుకున్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఆశలను ఆవిరి చేశారు. హామీలు అమలు చేయకుండా మూడేళ్లుగా రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడమే కాంగ్రెస్ సాధించిన ఘనత. కాంగ్రెస్ నేతల మాయమాటలను, నయవంచనను తెలంగాణ ప్రజలు ఇప్పటికే గుర్తించారు. ఇక మిగిలింది త్వరలోనే వారిగిన తగిన గుణపాఠం చెప్పడమేనని' బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఘాటుగా స్పందించారు.

తెలంగాణ ఆర్థిక వసూళ్లలో ఆసక్తికర గణాంకాలు

జిల్లా అగ్రస్థానంలో నిలవగా, ప్రభుత్వ ఖర్చులు లేదా రెవెన్యూ వ్యయం విషయంలో మాత్రం రంగారెడ్డి జిల్లా ముందంజలో ఉంది. జిల్లాల వారీగా ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి పనుల కేటాయింపుల్లో ఈ తేడాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తాజా నివేదిక ప్రకారం, రాష్ట్ర రెవెన్యూ వసూళ్లలో హైదరాబాద్ జిల్లా ఏకంగా రూ.84,746.81 కోట్ల భారీ ఆదాయంతో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్రంలోని వాణిజ్య కార్యకలాపాలు, పారిశ్రామిక సంస్థలు, సర్వీస్ సెక్టార్ మరియు రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఎక్కువగా ఈ ప్రాంతం పరిధిలోనే కేంద్రీకృతమై ఉండటమే ఇందుకు ప్రధాన కారణం.ఇక రూ.18,486.84 కోట్ల రెవెన్యూ వసూళ్లతో రంగారెడ్డి జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో నల్గొండ, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలు స్వల్ప వసూళ్లను సాధించగా.. జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ జిల్లాలు ఆదాయ సేకరణలో చివరి స్థానాల్లో ఉన్నాయి. మరోవైపు, ప్రభుత్వ వ్యయం లేదా జిల్లాలవారీగా జరుగుతున్న ఖర్చుల పరిశీలనలో రంగారెడ్డి జిల్లా రూ.3,428.35 కోట్ల రెవెన్యూ వ్యయంతో అగ్రస్థానంలో నిలిచింది. నల్గొండ రూ.2,690.21 కోట్లు, వరంగల్ అర్బన్ రూ.2,408.59 కోట్లు, ఖమ్మం రూ.2,277.98 కోట్లు, నిజామాబాద్ రూ.2,153.36 కోట్లు జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ములుగు రూ.563.79 కోట్లు, జయశంకర్ భూపాలపల్లి రూ.467.24 కోట్లు జిల్లాలు ఖర్చుల పరంగా వెనుకబడి ఉన్నాయి.ఆర్థిక నిపుణుల విశ్లేషణ ప్రకారం, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల మధ్య కేంద్రీకృతమైన ఆర్థికాభివృద్ధి మిగతా జిల్లాలతో పోలిస్తే భారీ అంతరానికి కారణమవుతోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల కల్పన, పరిపాలనాపరమైన వ్యయాలు జిల్లాలవారీగా మారుతున్న తీరును ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి. భవిష్యత్తులో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఈ డేటా కీలకం కానుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అక్వాన్ తుఫాన్ పట్ల అత్యంత అప్రమత్తత అవసరం

ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. వాతావరణ శాఖ తాజా నివేదికల ప్రకారం, అక్వాన్ తుపాను ఈ నెల 20వ తేదీన నెల్లూరు – తుని మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో తీరం వెంబడి గంటకు 120 నుంచి 145 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. తుపాను ప్రభావంతో నవంబర్ 19, 20 తేదీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు సంభవించే అవకాశముందని తెలిపారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, గత నెల రోజుల వ్యవధిలో అర్నబ్, మురసు తుపాన్లు రాష్ట్రాన్ని తాకాయని, అయితే వాటితో పోలిస్తే అక్వాన్ తీవ్రత చాలా ఎక్కువగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు తుపాన్ల సమయంలో ప్రభుత్వం తీసుకున్న పటిష్ఠమైన చర్యల వల్ల ప్రాణనష్టం జరగలేదని, ఇదే స్ఫూర్తితో అక్వాన్ తుపానును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు నిరంతరం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో వరి పంట చేతికి వచ్చే కీలక సమయంలో ఈ తుపాను రావడం దురదృష్టకరమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

రైతుల పంట నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించేందుకు పంచాయతీరాజ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సహకరించాలని, కోతకు వచ్చిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రైతులకు అండగా ఉండాలని సూచించారు. గత తుపాన్ల ధాటికి రాష్ట్రంలో దాదాపు 520 కిలోమీటర్ల మేర గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం అక్వాన్ వల్ల రోడ్లపై చెట్లు విరిగిపడినా లేదా ఇతర నష్టాలు జరిగినా యుద్ధప్రాతిపదికన రాకపోకలను పునరుద్ధరించాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు నేలకొరిగితే వెంటనే విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టేలా ఆ శాఖతో సమన్వయం చేసుకోవాలన్నారు.మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని, సామాన్య ప్రజలు కూడా బీచ్‌ల వైపు వెళ్లకుండా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఇటీవల తుపాను గాలుల్లో చిక్కుకుని తమిళనాడు మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయిన విషాదకర సంఘటనను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ప్రజల ప్రాణరక్షణకే ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులంతా గ్రామాల్లోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు.

రాయలసీమ 'హార్టికల్చర్ హబ్'పై స్పెషల్ ఫోకస్

తుఫాన్లతో రూ.7 వేల కోట్లకు పైగా నష్టం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అర్నాబ్, మురసు తుఫాన్ల వల్ల తీవ్రంగా నష్టపోయింది అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ రెండు తుఫాన్ల వల్ల ప్రాథమిక అంచనా ప్రకారమే సుమారు రూ.7 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కి వివరించారు. తుఫాన్ ముప్పు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలను సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. చేతికందే పంట నీటి పాలైందని ముఖ్యమంత్రి వివరించారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా రైతులను గట్టెక్కించేందుకు పట్టిసీమ ద్వారా కొన్ని ప్రాంతాలకు సాగు నీరందించామని కానీ తుఫాన్ల తాకిడితో పంటలు వేసుకున్న రైతులు తీవ్రంగా నష్టపోయారని చెప్పారు. దీంతో పాటు తీర ప్రాంతంలో మౌలిక వసతులు భారీ ఎత్తున దెబ్బతిన్నాయని ముఖ్యంగా విద్యుత్ వ్యవస్థ ఎక్కువగా నష్టపోయిందని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రికి తెలిపారు. రాష్ట్రానికి తుఫాన్ల వల్ల కలిగిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆర్నబ్, మురసు తుఫాన్ల వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు రాష్ట్రంలో పర్యటించాయని వారు కూడా వీలైనంత త్వరలో నివేదిక సమర్పిస్తాయని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తక్షణ సాయం అందించగలిగితే కొంత మేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు.

ప్రాంతాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

కేంద్ర ఆర్థిక మంత్రితో జరిగిన భేటీలో రాష్ట్రంలో చేపడుతోన్న అభివృద్ధి ప్రణాళికల అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. విశాఖ, అమరావతి, తిరుపతి రీజియన్ల వారీగా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు చేపట్టినట్టు సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. దీంట్లో భాగంగా రాయలసీమ హార్టికల్చర్ హబ్ కు ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. హార్టికల్చర్ హబ్ లో భాగంగా వివిధ స్థాయిల్లో మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నామని చెప్పారు. గ్రామాలకు రోడ్ నెట్ వర్క్, ఇరిగేషన్ అభివృద్ధి పనులు, డ్రిప్ ఇరిగేషన్ వంటి మీద ఫోకస్ పెట్టామని తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి సహకరించండి

మరోవైపు విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కి సీఎం చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ శర వేగంగా అభివృద్ధి చెందుతోందని దీనికి ఇప్పటికే కేంద్రం నుంచి వివిధ మార్గాల్లో సహకారం అందుతోందని దీనికి అదనంగా మరింత సాయం అందించగలిగితే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయని వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల సీఐఐ భాగస్వామ్య సదస్సు అంశం ప్రస్తావనకు వచ్చింది. రెండు రోజుల పాటు జరిగిన సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, వచ్చిన పెట్టుబడులు, వివిధ అంశాలపై జరిగిన చర్చల సారాంశాన్ని నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు నాయుడు వివరించారు. ఈ సదస్సు పారిశ్రామిక అభివృద్ధికి తోడ్పడేలా ఉందని అభిప్రాయ పడ్డారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పలువురు ఎంపీలు సహా ఆర్థిక శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఐపీఎల్‌కు ఎంఎస్ ధోనీ బైబై

ఒక కొత్త బాధ్యతలో కనిపిస్తాడు. మాది ఎప్పటికీ నిలిచిపోయే బంధం. చెన్నై సూపర్ కింగ్స్ మెంటార్‌గా ధోని బాధ్యతలు స్వీకరించారంటూ సీఎస్కే ఎక్స్ ఖాతాలో చేసిన పోస్ట్ వైరల్ అవుతోంది. '2008లో, ధోని సీఎస్‌కే జట్టులో భాగమై ఉండాలని నేను పట్టుబట్టాను. నేను తీసుకున్న అత్యుత్తమ నిర్ణయమని అదేనని ప్రూవ్ అయింది. ఫ్రాంచైజీ కోసం తాను సాధించిన విజయాల వల్ల మాత్రమే కాదు, వ్యక్తిత్వాన్ని బట్టి నిలిచి ఉన్నాడు. ఇది ఎప్పటికీ అతని సొంత ఇల్లు' అని పేర్కొన్నారు.చెన్నై సూపర్ కింగ్స్ యజమాని రూప గురునాథ్ మాట్లాడుతూ 'ఎంఎస్ ధోని లాంటి ఆటగాడు జీవితకాలంలో ఒక్కసారి మాత్రమే వస్తాడు. సీఎస్కే ఆరంభం నుంచి మాతో ఉండటం, ఈ జట్టు నేడు ఈ స్థాయిలో ఉండటానికి పునాది వేయడం మా అదృష్టం, మేము కృతజ్ఞత చెబుతున్నాం. సీఎస్కేకు దిగ్గజం కంటే ఎంఎస్ ధోని ఎంతో ఎక్కువ. మైదానం లోపల, వెలుపల ఆయన మాకు ఎంతో చేశారు. ఆయన కెప్టెన్సీ, వినయం, నిబద్ధత, లక్షలాది మంది అభిమానులతో ఆయన మమేకమైన తీరు ప్రత్యేకం. ఇన్నేళ్లలో మేము జీవితాంతం గుర్తుంచుకునే మధుర జ్ఞాపకాలను అందించారు. మెంటార్‌గా ఎంఎస్ సీఎస్‌కేలో భాగంగా కొనసాగుతారు. ముఖ్యంగా ఈ మార్పు దశలో ధోనీ అనుభవం, నైపుణ్యం మాకు ఎంతో విలువైనవి. జట్టులో చాలా మంది యువ ఆటగాళ్లు ఉన్నందున, ఆయన మార్గదర్శకత్వం కొత్త తరాన్ని తీర్చిదిద్దడంలో సహాయపడుతుందని' పేర్కొన్నారు.చెన్నై సూపర్ కింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్ విశ్వనాథన్ మాట్లాడుతూ ఒక క్రికెటర్‌గా ధోని సాధించిన విజయాలు ప్రతి అభిమాని మదిలో చెరగని ముద్ర వేశాయి. కానీ ధోనిని నిజంగా ప్రత్యేకంగా నిలిపింది ఏంటంటే, ఆయన చెన్నైలో భాగమైపోయారు అంటే ఈ నగరాన్ని అక్కున చేర్చుకున్నారు, చెన్నై కూడా ఆయనను తమ సొంత మనిషిగా ఆదరించింది. మేం వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, ట్రోఫీలు గుర్తుంటాయి. వాటిని మేం గెలుచుకున్న విధానం కూడా అంతే గుర్తుంటుంది. అదే ధోనీ అసలైన వారసత్వం. మైదానంలో పసుపు జెర్సీలో ధోనీని చూడలేకపోవడం మాకు కొంత వెలితిగా ఉన్నప్పటికీ, ఆయన మా ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంటారని స్పష్టం చేశారు.

ధోనీ ఐపీఎల్ రన్స్, రికార్డులు

ఒక కెప్టెన్‌గా అత్యధికంగా 5 ఐపీఎల్ టైటిళ్ల (ఉమ్మడి రికార్డు) విజయంలో సీఎస్కేను నడిపించడంతో పాటు, ఏ కెప్టెన్‌కూ సాధ్యం కాని విధంగా రెండు ఛాంపియన్స్ లీగ్ టీ20 టైటిళ్లను ధోని అందించారు. లీగ్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరిగా ధోని నిలిచాడు. 5,314 పరుగులతో సూపర్ కింగ్స్ తరపున రెండో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్, 272 మ్యాచ్‌లతో సీఎస్కే తరఫున అత్యధిక మ్యాచ్ లాడిన ప్లేయర్‌గా నిలిచారు. ఎన్నో లాస్ట్ బాల్ ఫినిషింగ్‌లు, హెలికాప్టర్ షాట్లు సీఎస్‌కే, ఐపీఎల్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ఒంటెద్దు పోకడలతో ఇంటర్ బోర్డు రద్దు చేస్తామంటే ఒప్పుకోం

పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యపై ప్రభుత్వం చెబుతున్న గణాంకాలు అందుకు భిన్నంగా ఉన్నాయని కవిత చెప్పుకొచ్చారు. మొత్తంగా చూస్తే డ్రాప్‌అవుట్ల శాతం 16 శాతంగానే ఉందని కవిత పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆ తర్వాత ప్రైవేట్ విద్యాసంస్థల్లోనో, ఇతర కోర్సుల్లోనో చేరుతున్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సూచించారు.



విద్యార్థులు చదువుకు దూరం కావడానికి ప్రభుత్వానిదే బాధ్యత

ఇకపోతే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువు కొనసాగించలేకపోతే ఎవరిది తప్పు? అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత ప్రశ్నించారు.గవర్నమెంట్ స్కూల్స్‌లో విద్యార్థులు చదువు కొనసాగించకపోవడానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని కోరారు.డ్రాప్‌అవుట్లకు ఆర్థిక ఇబ్బందులు, గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల కొరత సహా అనేక కారణాలు ఉన్నాయని, నీతి ఆయోగ్ కూడా పలు అంశాలను ప్రస్తావించింది అని చెప్పుకొచ్చారు.ముఖ్యంగా ఆర్థిక ఇబ్బందులే చదువుకు దూరం కావడానికి ప్రధాన కారణమని అభిప్రాయపడ్డారు. డ్రాప్‌అవుట్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత తెలిపారు.

నమో లక్ష్మి పథకాన్ని అమలు చేస్తే డ్రాప్ అవుట్ల తగ్గుదల

మరోవైపు గుజరాత్‌లో అమలు చేస్తున్న 'నమో లక్ష్మి' పథకం గురించి టీఆర్ఎస్ చీఫ్ కవిత ప్రత్యేకంగా ప్రస్తావించారు.ఈ పథకం ద్వారా విద్యార్థుల ఖాతాల్లోకి ఏటా రూ.928 కోట్లు జమ చేస్తున్నారని, దాని ప్రభావంతో డ్రాప్‌అవుట్లలో 16 శాతం తగ్గుదల నమోదైందని పేర్కొన్నారు. తెలంగాణలోనూ ఇలాంటి పథకాన్ని అమలు చేస్తే విద్యార్థులు చదువుకు దూరం కాకుండా చూడవచ్చు అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత సూచించారు. పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్‌కు వెళ్లే విద్యార్థినుల సంఖ్య తక్కువగా ఉందన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యలను కవిత ఖండించారు.పదో తరగతి నుంచి ఇంటర్‌కు వెళ్లే బాలికల శాతం 77.4 కాగా, బాలుర శాతం 68.4గా ఉందని అలాంటప్పుడు విద్యార్థినిల సంఖ్య తక్కువగా ఉందని ఎలా అంటారు అని ప్రశ్నించారు. కాబట్టి బాలుర విద్యపై ప్రభుత్వం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు.బాలురలో 51 శాతం మంది పరీక్షల్లో విఫలమవుతున్నారని, గంజాయి వినియోగం, చదువుపై నిర్లక్ష్యం వంటి అంశాలు ఇందుకు కారణమవుతున్నాయని వీటిపై ప్రభుత్వం దృష్టి సారించాలని టీఆర్ఎస్ చీఫ్ కవిత సూచించారు.

హైదరాబాద్‌లో కల్తీ మద్యం దందా

ఖాళీ ఖరీదైన మద్యం బాటిళ్లను సేకరించి వాటిలో రూ.560 విలువ చేసే చీప్ లిక్కర్ నింపి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. శంషాబాద్ పరిధిలోని శాతంరాయి ప్రాంతంలో ఈ వ్యవహారం బయటపడింది. దీంతో మందుబాబులకు ఒక్కసారిగా కిక్కుదిగిపోతోంది. శంషాబాద్‌లోని శాతంరాయి ప్రాంతానికి చెందిన వంగలి అశోక్ (43) గతంలో బగ్గా డిస్టిలరీలో ఉద్యోగం చేసేవాడు. అక్కడ పని మానేసిన తర్వాత క్యాబ్ డ్రైవర్‌గా మారాడు. అయితే సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో గతంలో మద్యం తయారీ పరిశ్రమలో పనిచేసిన అనుభవాన్ని ఉపయోగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన ఇంట్లోనే కల్తీ మద్యం తయారు చేసి విక్రయించే అక్రమ వ్యాపారానికి శ్రీకారం చుట్టాడు. అశోక్‌కు మహమ్మద్ యాకూబ్ పాషా (29) సహకరించేవాడు. యాకూబ్ పాషాకు స్క్రాప్ దుకాణం ఉండటంతో అక్కడికి వచ్చే ఖాళీ ఖరీదైన మద్యం బాటిళ్లను అశోక్‌కు సరఫరా చేసేవాడు. వాటిని సేకరించిన అశోక్ శుభ్రం చేసి మళ్లీ వినియోగిస్తూ కల్తీ మద్యం దందా కొనసాగిస్తున్నట్లు ఎక్సైజ్ అధికారులు గుర్తించారు.రూ.560 విలువ చేసే 'డౌన్ టౌన్' అనే చౌక మద్యాన్ని ఖరీదైన బ్రాండ్ల బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. జాన్ వెల్స్, జానీ వాకర్, డ్యూవార్స్, 100 పైపర్స్ వంటి బ్రాండ్ల పేర్లతో ఉన్న ఖాళీ బాటిళ్లను ఇందుకోసం ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. పాత బాటిళ్లను శుభ్రం చేసి, వాటిలో చౌక మద్యం నింపి అసలైన బ్రాండెడ్ మద్యంలా విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని అధికారులు తెలిపారు. క్యాబ్ నడుపుతూ అశోక్ ఈ మద్యాన్ని వినియోగదారులకు చేరవేస్తున్నట్లు సమాచారం. స్థానికంగా కొందరు రెగ్యులర్ కస్టమర్లకు కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. అయితే ఈ దందాలో మరెవరైనా ఉన్నారా ఇతర ప్రాంతాలకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేశారా అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ అక్రమ మద్యం వ్యాపారాన్ని ఎక్సైజ్ కానిస్టేబుల్ ధనుంజయ్ గుర్తించారు.

వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో డీటీఎఫ్ అధికారులు రంగంలోకి దిగారు. సీఐ నరేందర్ నేతృత్వంలోని బృందం అశోక్ ఇంటిపై ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ తనిఖీల్లో కల్తీ మద్యంతో నింపిన 10 ఫుల్ బాటిళ్లతో పాటు, మరో 30కి పైగా ఖాళీ ఖరీదైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రధాన నిందితుడు అశోక్‌తో పాటు ఖాళీ బాటిళ్లను సరఫరా చేస్తున్న స్క్రాప్ దుకాణం యజమాని యాకూబ్ పాషాను అరెస్ట్ చేశారు. ఇద్దరినీ, స్వాధీనం చేసుకున్న మద్యాన్ని శంషాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ కల్తీ మద్యాన్ని స్థానికంగా సుమారు 10 మంది రెగ్యులర్ కస్టమర

జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిగా గోపీచంద్ నాయక్ బాధ్యతల స్వీకరణ



మహబూబాబాద్: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిగా (ఇన్‌చార్జి) అజ్మీర గోపీచంద్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అధికారికంగా విధుల్లో చేరారు. రాష్ట్రస్థాయి అధికారుల ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లాకు డిప్యూటేషన్‌పై వచ్చిన ఆయన, శాఖ పరిధిలో అమలవుతున్న వివిధ సంక్షేమ పథకాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. కార్యాలయ సిబ్బంది, వసతి గృహాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ శాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

శ్రీసత్యసాయిబాబా జయంతి ఉత్సవాలు

- ఏపీ నుంచి ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి

- శ్రీకాకుళం, విజయవాడ నుంచి యలహంకకు



జన్మభూమి న్యూస్ విజయవాడ:ఆంధ్రప్రదేశ్‌లో రైలు ప్రయాణికులకు ముఖ్యమైన గమనిక.. సత్యసాయిబాబా జయంతి ఉత్సవాల సందర్భంగా ప్రయాణికుల కోసం విజయవాడ –యలహంక, శ్రీకాకుళంరోడ్– యలహంక మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు అధికారులు తెలిపారు. విజయవాడ – యలహంక (07246/07247) ప్రత్యేక రైలును ప్రకటించారు. ఈ నెల 21వ తేదీ సాయంత్రం 5గంటలకు రైలు (07246) యలహంకలో బయలుదేరి మరుసటిరోజు (నవంబర్ 22న) ఉదయం 7.45కి విజయవాడ చేరుకుంటుంది. ఈ రైలు (07245) తిరుగు ప్రయాణంలో ఈ నెల 23వ తేదీ రాత్రి 11.50కి విజయవాడలో బయలుదేరి మరుసటిరోజు మధ్యాహ్నం 3గంటలకు యలహంక చేరుకుంటుంది. ఈ రైలు పుట్టపర్తి, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, డోన్, నంద్యాల, దిగువమెట్ట, గిద్దలూరు, కంభం, మార్కాపురం రోడ్, దొనకొండ, నరసరావుపేట, గుంటూరు స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైలులో 2 సెకండ్ ఏసీ, 4 థర్డ్ ఏసీ, ఏడు స్లీపర్ క్లాస్, 4 జనరల్ సెకండ్ క్లాస్, 1 సెకండ్ క్లాస్ లగేజీ/దివ్యాంగ్, 1 జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లు ఉంటాయి.శ్రీకాకుళం రోడ్– యలహంక మధ్య రైలు (08555/08556) నడపనున్నారు. ఈ నెల 20వ తేదీ సాయంత్రం 4గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో రైలు (08555) బయలుదేరి మరుసటిరోజు (నవంబర్ 21) మధ్యాహ్నం 3గంటలకు యలహంక చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (08556) 24వ తేదీ సాయంత్రం 5గంటలకు యలహంకలో బయలుదేరి మరుసటిరోజు (నవంబర్ 25) సాయంత్రం 5.15కి శ్రీకాకుళం రోడ్ చేరుతుంది. ఈ రైలు చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం, కంభం, గిద్దలూరు, నంద్యాల, డోన్, గుంతకల్, ధర్మవరం, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం పుట్టపర్తి స్టేషన్లలో ఆగుతుంది. ఈ రైలులో 2 సెకండ్ ఏసీ, 4 థర్డ్ ఏసీ, 7 స్లీపర్ క్లాస్, 4 సెకండ్ జనరల్ క్లాస్, 1 సెకండ్ క్లాస్ లగేజీ దివ్యాంగ్, 1 జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లు ఉంటాయి.శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో శ్రీసత్యసాయి 101వ జయంత్యుత్సవాలు ఘనంగా ప్రారంభమ య్యాయి. ఈ వేడుకలు ఈనెల 24 వరకు కొనసాగుతాయని సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ తెలిపారు. ఈ నెల 18న శ్రీసత్యసాయి రథోత్సవం, 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవం, 20, 21వ తేదీల్లో శ్రీసత్యసాయి సేవాదళ్ జాతీయ సదస్సులు నిర్వహించబోతున్నట్లు ప్రకటించారు. ఈ నెల 22న జరిగే శ్రీసత్యసాయి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవాలకు ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్, సినీనటి రష్మిక హాజరవుతారన్నారు. ఈ నెల 23న హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయి జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహిస్తామన్నారు.

జనగణనకు సన్నద్ధం

- పకడ్బందీ నిర్వహణకు కలెక్టర్ ఆదేశం



నంద్యాల, నవంబరు 17: జనగణనను పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటి వివరాలను సమగ్రంగా సేకరించి, ఏ నివాస ప్రాంతం మినహాయింపు కాకుండా చూడాలన్నారు.మంగళవారం నంద్యాలలోని మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన జనగణన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు నాణ్యమైన శిక్షణ అందించాలని, డిజిటల్ విధానాలపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. గృహ వసతులు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వలసల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. స్వీయ జనగణనపై ప్రజలకు అవగాహన కల్పించి, నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో శిక్షకులు ఎం. శ్రీనివాసరావు, జి. విష్ణు మాధురి, డి. సుస్మిత, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో బస్సు నడిపి జైలుకు

- డ్రైవర్‌కు మూడు రోజుల శిక్ష

నంద్యాల, నవంబరు 17: మద్యం సేవించి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నడిపిన డ్రైవర్‌కు ఆళ్లగడ్డ స్పెషల్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష విధించారు. జిల్లా ఎస్పీ సునీల్ షౌరాణ్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్ సూచనలతో మంగళవారం తెల్లవారుజామున చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద ఆర్ఐ బాబు, ఎస్ఐ నాగేంద్ర ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టారు. మధ్యప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ ముఖేష్ నడుపుతున్న ప్రైవేట్ బస్సును తనిఖీ చేయగా, బ్రీత్ అనలైజర్ పరీక్షలో పరిమితికి మించి మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. దీంతో డ్రైవర్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

సర్పంచ్ ఎన్నికల్లో హింస..

– పోల్ సిబ్బందిపై దాడి, మెజిస్ట్రేట్ కారు దగ్ధం

జైపూర్: రాజస్థాన్‌లో సోమవారం సర్పంచ్ ఎన్నికలు జరిగాయి. భారీ సంఖ్యలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే బాన్స్‌వారా జిల్లాలో హింస చోటుచేసుకున్నది. ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి మద్దతుదారులు వీరంగం సృష్టించారు. పోలింగ్ సిబ్బందిపై దాడి చేశారు. జోనల్ మెజిస్ట్రేట్‌కు చెందిన వాహనాన్ని తగులబెట్టారు. సర్పంచ్ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ఈ ఘటన జరిగింది. బవిడి నినామా గ్రామ పంచాయతీ పరిధిలో ఈ విధ్వంసం చోటుచేసుకున్నది. లలిత్ కుమార్ అనే సర్పంచ్ అభ్యర్థి 32 ఓట్లతో ఓటమి పాలయ్యాడు. దీంతో అతని మద్దతుదారులు హింసకు పాల్పడ్డారు. ఫలితాల ప్రకటనపై వ్యతిరేకత వ్యక్తం చేసిన లలిత్ మద్దతుదారులు ఆవేశంతో పోలింగ్ సిబ్బందిపై దాడి చేశారు. మొత్తం మూడు వాహనాలకు నిప్పుపెట్టారు. గెలిచిన అభ్యర్థి బృందంపై రాళ్లతో దాడి చేశారు. గొడవ నేపథ్యంలో భారీ సంఖ్యలో భద్రతను ఏర్పాటు చేశారు

కోనసీమ జిల్లాలో బ్లోఅవుట్

– ఆందోళనలో ప్రజలు

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో గ్యాస్ బ్లోఅవుట్ జరిగింది. మామిడికుదురు మండలం నగరం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. తాడివారి మెరక ఓఎన్‌జీసీ రీడ్రిల్లింగ్ పాయింట్ నుంచి సీఎన్‌జీ గ్యాస్ లీకైంది. చుట్టుపక్కల గ్రామాలకు గ్యాస్ విస్తరిస్తుండటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. అప్రమత్తమైన అధికారులు.. క్షేత్రస్థాయికి వెళ్లి గ్యాస్ లీక్‌ను నివారించేందుకు చర్యలు చేపట్టారు. పరిసరాల్లోని ప్రజలను ఖాళీ చేయిస్తున్నారు. నరసాపురం నుంచి బ్లోఅవుట్ కంట్రోల్ టీమ్ నగరం గ్రామానికి బయల్దేరింది. గ్యాస్ బావి వద్ద మంటలు వ్యాపించకుండా ఫైర్ సిబ్బంది యత్నిస్తున్నారు. గ్యాస్ బ్లోఅవుట్ చుట్టూ మంటలు వ్యాపించకుండా వాటర్ అంబ్రెల్లా ఏర్పాటు చేశారు. బ్లోఅవుట్ దృష్ట్యా 216 జాతీయ రహదారి బైపాస్‌పై రాకపోకలను నిలిపివేశారు

స్కూల్ బస్ వెనుక
వాహనదారుడి హల్‌చల్

– ప్రజల్లో భయాందోళన

విజయవాడ విజయవాడలో చర్చి సెంటర్ నుంచి సితార వరకు స్కూల్ బస్ వెనుక వాహనదారుడు డేంజర్ డ్రైవింగ్ చేసిన వీడియోలు హల్ చల్ చేసాయి. స్కూల్ బస్‌కు దగ్గరగా వెనుకాల ఫాలో అవుతూ వెనకాలే వచ్చే వాహన దారుణ్ణి డ్రైవింగ్ చేయకుండా ప్రజలకు ఇబ్బంది కలిగించినట్లు స్థానికులు ఆరోపించారు. వాహనం వెనుక నంబర్ ప్లేట్ తీసేసి రైడ్ చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసినట్లు సమాచారం. ఘటనపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

బంగాళాఖాతంలో అక్వాన్ తుపాను..
ఏపీ తీరానికి ముప్పు

– గడిచిన 9 గంటలుగా స్థిరంగా కేంద్రీకృతం..

– శుక్రవారం నెల్లూరుతుని మధ్య తీరం దాటే అవకాశం

బంగాళాఖాతంలో కొనసాగుతున్న అక్వాన్ తుపాను గడిచిన 9 గంటలుగా స్థిరంగా కేంద్రీకృతమై ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్ వెల్లడించారు. ప్రస్తుతం చెన్నైకి 610 కి.మీ., మచిలీపట్నానికి 660 కి.మీ., విశాఖపట్నానికి 670 కి.మీ., ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కి.మీ. దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. ఈరోజు సాయంత్రానికి తీవ్ర తుపానుగా, పశ్చిమ?వాయవ్య దిశగా ప్రయాణిస్తూ ఎల్లుండి ఉదయానికి అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. శుక్రవారం మధ్యాహ్నానికి నెల్లూరు?తుని మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా. తీరం దాటే సమయంలో గంటకు 120?130 కి.మీ. వేగంతో, గరిష్ఠంగా 145 కి.మీ. వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉంది.

విశాఖలో యువతి అనుమానాస్పద మృతి..
మన్యం జిల్లాకు చెందిన త్రివేణి కన్నుమూత

- పోతినమల్లయ్యపాలెంలో కలకలం.. - మృతికి కారణాలపై పోలీసుల దర్యాప్తు

విశాఖపట్నం పోతినమల్లయ్యపాలెం హౌసింగ్ బోర్డు కాలనీలో యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. క్రికెట్ స్టేడియం సమీపంలోని కాలనీలో ఒంటరిగా నివాసం ఉంటున్న మన్యం జిల్లాకు చెందిన త్రివేణి (26) మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు.

సమాచారం అందుకున్న పీఎం పాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, త్రివేణి మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.మన్యం జిల్లా నుంచి విశాఖకు వచ్చిన యువతి అనుమానాస్పద మృతి వెనుక అసలు కారణాలేంటి? పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి రావాల్సి ఉంది.

నన్ను బదనాం చేస్తున్నారు

– ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

వరంగల్ రూ.4,000 కోట్ల భూవివాదంపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందించారు. ముఖ్యమంత్రి స్థాయి నుంచి కార్పొరేటర్ల వరకు అనేక మంది మాట్లాడుతున్నారని, అసలు విషయాన్ని పక్కదారి పట్టిస్తూ తనను బదనాం చేసే ప్రయత్నం జరుగుతోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మండిపడ్డారు. ఆ ప్రాంతంలో ఎవరూ జోక్యం చేసుకోకుండా 144 సెక్షన్ విధించారని ఆయన తెలిపారు. ఈ ఆస్తి ఇరానీ తరహా పేర్లు ఉన్నవారి తల్లిదండ్రుల నుంచి అర్బన్ ల్యాండ్ సీలింగ్ (జఒఅ) పరిధిలోకి వచ్చిందని, దీనిపై ప్రస్తుతం కోర్టులో కేసులు నడుస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు.

నేర నియంత్రణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా లాడ్జిలు, డార్మిటరీల్లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు...



ప్రకాశం నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నారు.ప్రకాశం జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు, జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న లాడ్జిలు, డార్మిటరీలు, బస చేసే వసతి గృహాలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో భాగంగా లాడ్జిలు, డార్మిటరీల్లో బస చేస్తున్న వ్యక్తుల వివరాలు, గుర్తింపు పత్రాలు, రిజిస్టర్‌ల నిర్వహణ, గదుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. లాడ్జి నిర్వాహకులు ప్రతి ఒక్కరి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, సరైన గుర్తింపు పత్రాలను పరిశీలించిన అనంతరమే గదులు కేటాయించాలని సూచించారు.అలాగే, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు లాడ్జిలు, డార్మిటరీలు వేదిక కాకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు నిరంతరం నిఘా మరియు ఆకస్మిక తనిఖీలను కొనసాగిస్తారని తెలిపారు.

కుటుంబ కలహాలు..

పెంపుడు కుక్కను చంపి దంపతుల బలవన్మరణం!

- వరంగల్ రంగశాయిపేటలో తీవ్ర విషాదం..

- ఆర్థిక, కుటుంబ సమస్యలే కారణమా? పోలీసుల దర్యాప్తు

వరంగల్, నవంబర్ 17 : వరంగల్ నగరంలోని రంగశాయిపేటలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల నేపథ్యంలో భార్యాభర్తలు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. దంపతులు తమ పెంపుడు కుక్కను సైతం చంపిన అనంతరం ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు ప్రాథమిక సమాచారం.రంగశాయిపేటకు చెందిన సంజీవ్, శోభ దంపతులు మంగళవారం తమ ఇంట్లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. ఆత్మహత్యకు ముందు తమ పెంపుడు కుక్కను కూడా చంపినట్లు సమాచారం. ఈ ఘటనను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

అముదాలవలస నియోజకవర్గంలో అప్పుడు, ఇప్పుడు బావ, బావమరిది గారి కుటుంబాలే!

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా అముదాలవలస నియోజకవర్గం లో, ఒకప్పుడు తెలుగుదేశం పార్టీ లో భావ, భావమరుదుల కుటుంబం ల పెత్తనం నడిచేది.. ఆ కుటుంబం లో చిలికలు వచ్చి రెండు కుటుంబం ల, పెత్తనం గా మారింది.. ఒక కుటుంబం మేమో బావ తమ్మినేని సీతారాం ది కాగా,.. రెండొవ కుటుంబం మేమో బావమరిది మరియు మేనల్లుడు కూన రవికుమార్. కుటుంబం దే . ఈ ఇద్దరు ఒకప్పుడు కలిసిమెలిసి వుండే వారు.. బావ తమ్మినేని సీతారాం రాజకీయ జీవితం టీడీపీ తో ప్రారంభం అయ్యింది.. ఎన్టీఆర్ హయాంలో అసెంబ్లీ విప్ గా, చంద్రబాబు హయాంలో మంత్రిగా తమ్మినేని తొమ్మిదేళ్ల మంత్రిగా పనిచేసారు. బావమరిది కమ్ మేనల్లుడైన కూన రవి కుమార్ , టీడీపీ లోనే కొనసాగారు. 2009 లో సితారామ్ మో, ప్రజారాజ్యం పార్టీ తరుపున పోటీ చేయగా, బావమరిది కూన రవికుమార్ టీడీపీ అభ్యర్థి గా పోటీచేసి, ఈ ఇద్దరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పై ఓడిపోయారు.. 2014 లో తమ్మినేని వైసీపీ అభ్యర్థి గా పోటీచేసి, టీడీపీ అభ్యర్థి కూన రవి పై ఓడిపోయారు.. 2019 లో సిన్ తారుమారైంది.. అంటే తమ్మినేని గెలిచారు.. కూన ఓడిపో యారు.. గెలిచిన తమ్మినేని అసెంబ్లీ స్పీకర్ అయ్యారు.. అప్పటినుండి తమ్మినేని కుటుంబం పాలన ఎక్కువైంది.. తమ్మినేని తో పాటు, ఆయన భార్య (ఈమె కూన రవి కుమార్ గారి కి స్వయాన అక్క.. అంతే కాదు సొంత అక్క కూతురినే తమ్మినేని పెళ్ళి చేసుకున్నారు అన్న మాట), ఆయన కుమారుడు కూడా, ఆమధాలవలస లో పెత్తనం చేయటం ప్రారంభించారు. గత ఎన్నికల లలో తమ్మినేని గా ఘోరాతి ఘోరంగా ఓడించి, టీడీపీ అభ్యర్థి కూన రవి నే గెల్పించారు.. ఈయన ని అ సెంబ్లీ విప్ పదవిలో చంద్రబాబు నియమించారు. (ఇదే పదవిలో, 1995 లో సీతారాం ని దివం గత ఎన్టీఆర్ నియమించారు).. ఇక అసలు విషయం ఏమిటంటే తాజాగా జరగబోతున్న మున్సిపల్ ఎన్నికలలలో, కూన రవికుమార్ భార్య గారే, టీడీపీ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేసారు.. వైసీపీ నుండి చైర్మన్ అభ్యర్థిగా తమ్మినేని కుటుంబం సభ్యులెవ్వరైనా పోటీచేస్తారా ఇంకెవ్వరైనా పోటీచేస్తారా??. కొన మెరుపు ఏమిటంటే.. కూన రవి మంత్రి పదవిని ఆశించారు.. చంద్రబాబు ఆయన ని అసెంబ్లీ విప్ పదవికే పరిమితం చేసారు.. తనకు మంత్రి పద్వి రాదని తెలుసుకున్న, కూన, అముదాలవలస మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గా భార్య నే, పోటీ లో దింపారు.

విద్యుత్ తీగలు తగిలి విద్యార్థిని మృతి.. రాంనగర్

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో కొనసాగుతున్న ప్రైవేట్ బాలికల వసతి గృహంలో విషాదం చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఒక బాలిక మృతి చెందగా, మరో బాలికకు గాయాలయ్యాయి. సికింద్రాబాద్ రైల్వే నిలయం సమీపంలోని అంబేద్కర్ నగర్ కు చెందిన బాలిక(11) సదరు వసతి గృహంలో ఉంటూ మూడో తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం వసతి గృహం రెండో అంతస్తులో తోటి విద్యార్థినులతో ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు పైనున్న హైటెన్షన్ విద్యుత్ తీగ తగిలినట్లు ప్రాథమిక సమాచారం.ఈ ప్రమాదంలో 11 ఏళ్ల బాలిక అక్కడికక్కడే మృతి చెందగా, పక్కనే ఉన్న మరో బాలికకు చేతులకు గాయాలయ్యాయి. మరో బాలిక స్వల్ప గాయాలతో బయటపడింది. సమాచారం అందుకున్న వసతి గృహ నిర్వాహకులు ముషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన బాలికకు చికిత్స అందించారు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై కమిషనర్ ఆకస్మిక తనిఖీ

- పనుల్లో నిర్లక్ష్యం వద్దు.. సిబ్బందికి బి. శేషన్న ఆదేశాలు



నంద్యాల, నంద్యాల పట్టణంలోని జ్ఞానాపురం ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న పారిశుద్ధ్య పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వీధుల్లో పరిశుభ్రత, చెత్త తొలగింపు, మురుగునీటి కాలువల నిర్వహణ, పారిశుద్ధ్య పనుల పురోగతిని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. కాలువల్లో పూడిక తొలగించి మురుగునీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని, పారిశుద్ధ్య నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించాలని సిబ్బందికి కమిషనర్ సూచించారు.ఈ తనిఖీలో మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు విక్రమ్, శభరిష్, శానిటేషన్ సూపర్‌వైజర్,చంద్రహాస్ రెడ్డి. శానిటేషన్ ఇన్స్పెక్టర్లు శివప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జల సంరక్షణకు సమగ్ర ప్రణాళిక

- 27 క్యాస్కేడ్ల పరిధిలో 86 చెరువుల అభివృద్ధి



నంద్యాల, నవంబరు 17: జిల్లాలో జల వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, చెరువుల పునరుద్ధరణకు సమగ్ర కార్యాచరణ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో కేంద్ర జల సంఘం అధికారులతో సమావేశమైన ఆమె, జిల్లాలో చేపడుతున్న జల సంరక్షణ కార్యక్రమాలను వివరించారు.డోన్, ప్యాపిలి, బేతంచర్ల, బనగానపల్లి, కొలిమిగుండ్ల ప్రాంతాల్లో రాతి నేలలు అధికంగా ఉండటంతో భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. 27 క్యాస్కేడ్ల పరిధిలో 86 చెరువులను అనుసంధానించి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఫీడర్ ఛానళ్ల అభివృద్ధికి 2,151 పనులు చేపట్టినట్లు వెల్లడించారు.పట్టణ మురుగునీరు నదుల్లో కలవకుండా శుద్ధి కేంద్రాల నిర్మాణంపై దృష్టి సారించామన్నారు. కుందూ నది పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 7వ జాతీయ జల అవార్డుల సాధనకు జిల్లాలో చేపట్టిన ఉత్తమ కార్యక్రమాలను ఆధారాలతో సమర్థవంతంగా వివరించాలని అధికారులను ఆదేశించారు

ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం



ఏలూరు: మధుమేహం అనేది కేవలం వయస్సు పైబడిన వారికే పరిమితమైన వ్యాధి కాదని, నేటి జీవనశైలి మార్పుల నేపథ్యంలో యువతలోనూ ఈ వ్యాధి ముప్పు పెరుగుతోందని పేర్కొన్నారు డాక్టర్ జ్యోతి కుమారి. ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం వంటి కారణాల వల్ల మధుమేహ వ్యాధి విస్తృతంగా వ్యాపిస్తోంది. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు గుర్తింపు, నివారణ చర్యల ప్రాధాన్యతను తెలియజేయడం లక్ష్యంగా సి.హెచ్.ఎస్.డి. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల లో న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ జ్యోతి కుమారి మాట్లాడుతూ, మధుమేహాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి, వైద్యుల సూచనల మేరకు తగిన చికిత్స పొందడం ద్వారా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. అధిక దాహం, తరచుగా మూత్ర విసర్జన, ఆకలి పెరగడం, కారణం లేకుండా బరువు తగ్గడం, అధిక అలసట, చూపు మందగించడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవడం ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించి నియంత్రణలో ఉంచుకోవచ్చని వివరించారు. ప్రతి సంవత్సరం నవంబరు 14న ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని నిర్వహిస్తారని, ఇన్సులిన్‌ను సహ-కనుగొన్న శాస్త్రవేత్త సర్ ఫ్రెడెరిక్ బాంటింగ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ తేదీని ఎంపిక చేశారని తెలిపారు. మధుమేహ వ్యాధిపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించడం, వ్యాధి నివారణ మరియు నియంత్రణకు అవసరమైన చర్యలను ప్రోత్సహించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే, సమతుల ఆహారం తీసుకోవడం, ఆకుకూరలు, కూరగాయలు, పీచు పదార్థాలు అధికంగా ఉండే ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం, అధిక చక్కెర మరియు కొవ్వు పదార్థాలను తగ్గించడం, ప్రతిరోజూ నడక లేదా ఇతర వ్యాయామాలు చేయడం, తగినంత నిద్రపోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను జీవనశైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. మధుమేహం ఉన్నవారు వైద్యుల సూచనల మేరకు మందులు క్రమం తప్పకుండా వాడుతూ, ఆహార నియమాలను పాటిస్తూ, రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షించుకోవాలని తెలిపారు. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స పొందడం కంటే, వ్యాధి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమనే సందేశాన్ని ఈ అవగాహన కార్యక్రమం ద్వారా విద్యార్థినులకు తెలియజేశారు. ఆరోగ్యంపై అవగాహన, క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, సరైన ఆహారపు అలవాట్లే మధుమేహ నియంత్రణకు కీలకమని నిర్వాహకులు పేర్కొన్నారు.

15 ఏళ్ల ట్రాఫిక్ సమస్యకు తెర..
రైల్వే భూముల అప్పగింత పూర్తి



కొత్తగూడెం పట్టణ ప్రజలను ఏళ్లుగా వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కీలక ముందడుగు పడింది. కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుంచి హేమచంద్రాపురం వెళ్లే ప్రధాన రహదారి విస్తరణకు అవసరమైన రైల్వే భూములను రెవెన్యూ శాఖకు అప్పగించే ప్రక్రియ పూర్తయింది. సుమారు 15 నుంచి 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోగా, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సమన్వయ సహకారం అందించారు. మంగళవారం రైల్వే స్టేషన్ వద్ద ఎంపీ సమక్షంలో భూముల అప్పగింత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కొత్తగూడెం పర్యటనకు వచ్చిన సమయంలో స్థానికులు హేమచంద్రాపురం రోడ్డు విస్తరణ సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. అప్పటి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సహకారంతో భూముల సర్వే, మార్కెట్ విలువ నిర్ధారణ, ప్రతిపాదనల రూపకల్పన చేపట్టినట్లు వివరించారు. దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో చర్చలు జరిపి భూముల మార్పిడికి అంగీకారం సాధించినట్లు పేర్కొన్నారు. భూముల మార్పిడిలో భాగంగా కొత్తగూడెంలో రైల్వే శాఖకు చెందిన సుమారు 5,500 చదరపు గజాల భూమిని రోడ్డు విస్తరణ కోసం రెవెన్యూ శాఖకు అప్పగిస్తున్నట్లు తెలిపారు. దీనికి ప్రతిగా ఖమ్మం పట్టణంలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సుమారు 4,500 చదరపు గజాల భూమిని రైల్వే శాఖకు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారంతో ప్రభుత్వ అనుమతులు, భూముల మార్పిడి ప్రక్రియ ముందుకు సాగిందన్నారు. మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ.. హేమచంద్రాపురం రోడ్డు విస్తరణ పట్టణ ప్రజల చిరకాల ఆకాంక్ష అని పేర్కొన్నారు. భూముల సమస్య పరిష్కారమైన నేపథ్యంలో త్వరలో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే సుమారు కోటి రూపాయలతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టినట్లు వివరించారు. కొత్తగూడెం పట్టణంలో రైల్వే లైన్‌కు ఈ వైపున ఉన్న ఐదు ప్రధాన రహదారులను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. సూర్య ప్యాలెస్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు, గణేష్ టెంపుల్ నుంచి ప్రగతి వన్ నగర్ వరకు రహదారుల విస్తరణ, ఆధునిక లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పట్టణాన్ని మెరుగైన మౌలిక సదుపాయాలతో ఆధునిక వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పేరును కొత్తగూడెంగా మార్చేందుకు కూడా ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, తహసీల్దార్ పుల్లయ్య, రైల్వే రీజినల్ ఇంజనీర్ శశాంక్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రసన్న కుమారి, సీపీఐ నాయకులు సబీర్ పాషా, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో నేడు ఉద్యోగ, ఉపాధ్యాయుల ధర్మ దీక్ష.. భారీ మద్దతు



కొత్తగూడెం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలనే డిమాండ్‌తో మంగళవారం (నవంబర్ 17) కొత్తగూడెంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు ధర్మ దీక్ష చేపట్టనున్నారు. టీఎస్ సీపీఎస్ ఈయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ధర్నా చౌక్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. 2023 నవంబర్ 17న హన్మకొండలో జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు గుర్తు చేస్తున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ధర్మ దీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్మ దీక్షకు మద్దతుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయశాఖ ఉద్యోగులు ముందుకొచ్చారు. కొత్తగూడెం జిల్లా కోర్టు వెలుపల సన్నాహక సమావేశం నిర్వహించి కార్యక్రమానికి తమ మద్దతు ప్రకటించారు. ఈ సమావేశంలో పలువురు జ్యుడీషియల్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

తుమ్మల వ్యాఖ్యలను ఖండించిన రాజనాల



వరంగల్ మంథనిలో విలేకరుల ఏసమావేశంలో అగ్రికల్చర్ మంత్రి తుమ్మల కాంగ్రెస్ పార్టీ నెక్ట్ అధికారంలో రాదు అని పేర్కొనడాన్ని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి తీవ్రంగా ఖండించారు.మంగళ వారం వరంగల్ లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఎలెనో ఎఫెక్ట్ వల్ల. గత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైటెక్ సిటీ ఇంప్లిమెంట్ చేసిన ప్రభుత్వం అధికారం కోల్పోయింది అని అప్పుడు తెలంగాణ ప్రజలు అసంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యేలు మనసులో ఉన్న మాటలను నేను తెలియజేస్తున్నాను పేర్కొనడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. 45 లక్షల మంది కొత్త పెన్షన్లు ఇవ్వడం జరిగింది ఆర్థిక ఇబ్బందులు ఉన్నా కూడా అధికారం కోల్పోయిన కోల్పోతుందని సీఎం రేవంత్ రెడ్డి వల్ల పార్టీకి నష్టం జరుగుతుందని తుమ్మల అనడం హేయనీయమన్నారు. తుమ్మల నాగేశ్వరావు టిడిపిలో మంత్రిగా టిఆర్ఎస్ లో మంత్రిగా ఇప్పుడు కాంగ్రెస్ లో మంత్రిగా అన్ని పార్టీలో పనిచేసి ఇప్పుడు ఏ కొత్త పార్టీలో వెళ్లడానికి ఆలోచించి చేస్తున్నాడని అని అన్నారు ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్ సతీష్ తదితరులు పాల్గొన్నారు...

గుట్టకు అక్రమంగా మట్టి, రాళ్ళు తవ్వకాలు చేపడుతున్న ముగ్గురు వ్యక్తుల అరెస్ట్, రిమాండ్

- ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వకాలు
- పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు పట్టుబడిన నిందితులు
- అక్రమ మట్టి తవ్వకాలు, అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు
- మావల ఎస్‌హెచ్‌ఓ బి.డి. ప్రేమ్ కుమార్



ఆదిలాబాద్ మావల మండల పరిధిలోని మావల గ్రామ శివారులో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టి తరలించేందుకు ప్రయత్నించిన ముగ్గురు వ్యక్తులను మావల పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్ కు తరలించడం జరిగింది.ఈ నెల 15వ తేదీ సాయంత్రం సుమారు 5:30 గంటల సమయంలో మావల పోలీస్ స్టేషన్‌కు సిబ్బంది తో కలిసి గ్రామ శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక చిన్న గుట్ట సమీపంలో జేసీబీ, టిప్పర్ వాహనాలు నిలిపి ఉండటాన్ని, అక్కడ ముగ్గురు వ్యక్తులు మట్టి తవ్వి టిప్పర్‌లో లోడింగ్ చేస్తుండటాన్ని గమనించారు.వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ముగ్గురు వ్యక్తులను విచారించగా, వారు పాంధేన సతీష్, మోసిన్ ఖాన్, షేక్ నవీద్‌గా గుర్తించారు. మట్టి తవ్వకాలు చేపట్టడానికి, తవ్విన మట్టిని తరలించడానికి సంబంధించి ప్రభుత్వ శాఖల నుంచి పొందాల్సిన ఎలాంటి అనుమతులు లేదా చెల్లుబాటు అయ్యే పత్రాలు తమ వద్ద లేవని వారు అంగీకరించారు.ప్రభుత్వ అనుమతులు లేకుండా సహజ వనరులను తవ్వడం, అక్రమంగా తరలించడం చట్టరీత్యా నేరమని పోలీసులు స్పష్టం చేశారు. దీంతో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని, సంబంధిత జేసీబీ, టిప్పర్ వాహనాలతో సహా మావల పోలీస్ స్టేషన్‌కు తరలించారు

లబ్ధిదారులకు చేయూత పింఛన్లు
పంపిణీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్

చిగురుమామిడి చిగురు మామిడి మండలంలో 550 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు. అర్హులైన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు మంత్రి పొన్నం ప్రభాకర్ మంజూరు చేసారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చిత్రా మిశ్రా,జిల్లా మరియు మండల అధికారులు వివిధ గ్రామాల సర్పంచ్ లు,మార్కెట్ కమిటీ చైర్మన్,సింగిల్ విండో చైర్మన్ ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ప్రజా పాలన ప్రభుత్వంలో రాష్ట్రంలో కొత్తగా ఏడు రకాల పెన్షన్లు మంజూరు చేస్తున్నాం. వృద్ధులకు పెన్షన్లు అందించాలనే డిమాండ్ మేరకు త్వరలోనే దరఖాస్తులు స్వీకరించి అర్హులందరికీ పెన్షన్లు అందిస్తాం. సరైన ఆధారాలు లేక పెన్షన్లు తిరస్కరణకు గురైన వారికి మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తాం. ఈ నెల 19 నుంచి కొత్త పెన్షన్ల నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని అన్నారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి

విజయనగరం జిల్లాలో మూడు విడతల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పటిష్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, పోలీసు అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో రాజకీయ, వ్యక్తిగత కక్షలతో అల్లర్లు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, చట్టప్రకారం బైండోవర్ చర్యలు చేపట్టాలి.

బైండోవర్ చేసిన వ్యక్తులు నిబంధనలు ఉల్లంఘించకుండా, బాండ్లను ఎగ్జిక్యూట్ చేయాలి. గ్రామాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేసి, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను పర్యవేక్షించాలి. సమస్యాత్మక గ్రామాల్లో అవసరాన్ని బట్టి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, లాఠీ తనిఖీలు నిర్వహించాలని అన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, భయభ్రాంతులకు గురిచేయడం, ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఎన్నికల సమయంలో కుల, మత, వర్గ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు, ప్రచారాలను నియంత్రించాలి. సోషల్ మీడియాలో ఎన్నికలకు సంబంధించి తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వారిపై నిఘా ఉంచాలి. ఎన్నికల సమయంలో వదంతులు వ్యాప్తి చెందకుండా సోషల్ మీడియా వేదికలను నిరంతరం పర్యవేక్షించాలి. గ్రామ సభలు, పల్లె నిద్ర కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలి. ఎన్నికల కారణంగా గ్రామాల్లో వ్యక్తిగత కక్షలు, వర్గ విభేదాలు, ఘర్షణలు తలెత్తకుండా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువతకు అవగాహన కల్పించాలి. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. వదంతులను నమ్మవద్దు, వాటిని ఇతరులకు పంపవద్దు. ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు ఎవరూ పాల్పడవద్దన్నారు. ప్రతి ఓటరు ఎటువంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తన ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపడుతుందని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



సిద్దిపేట ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనిజిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. ఈనెల 19 న రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దిపేట పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మి పెరుమాళ్ తో కలిసి జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. ఈనెల 19 న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లా కేంద్రానికి హెలిక్యాప్టర్ లో చేరుకొని నిర్దేశించిన ప్రాంతం నుండి సభాస్థలి వరకు పాదయాత్ర నిర్వహించి ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఇందిరమ్మ చీరల పంపిణీ, మరియు ఇందిరమ్మ కుటుంబబీమా పథకాలను ప్రారంభించి భారీ బహిరంగ సభ నిర్వహిస్తారని ఇందుకు వివిధ శాఖలకు కేటాయించిన పనులను సమన్వయంతో నిర్వహించి ఎలాంటి లోటు పాట్లు లేకుండా సభ విజయవంతం అయ్యేలా కృషి చేయాలని అన్నారు. పాసుల జారీ, డయాస్ ఏర్పాటు, అధిక సంఖ్యలో హాజరై ప్రజలకు ఇబ్బంది కలగకుండా కుర్చీల ఏర్పాటు, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్ల సౌకర్యం, నిరంతరాయ విద్యుత్, సౌండ్ సిస్టం ఏర్పాటు, మెడికల్ క్యాంపు, అంబులెన్స్ ల ఏర్పాటు, ఎలిప్యాడ్ ఏర్పాటు, గట్టి పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్ తదితర అన్ని పనులను పకడ్బందీగా చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, జిల్లా అటవీ శాఖ అధికారి పద్మజారాణి, సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, రామ్మూర్తి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేవారం పంచాయతీ అభివృద్ధే లక్ష్యం..

- తుర్రం రామస్వామికి అఖండ మెజారిటీతో మద్దతు తెలపండి
- గ్రామంలోని ప్రతి వీధికి సీసీ రోడ్లు.. వీధిలైట్లు, తాగునీటి సౌకర్యం కల్పిస్తాం
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం



దేవీ పట్నం దేవారం పంచాయతీ అభివృద్ధి, గ్రామ ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ సర్పంచ్ అభ్యర్థి తుర్రం రామస్వామి ప్రజల ముందుకు వస్తున్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని గ్రామ ప్రజలను కోరుతున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వీధికి నాణ్యమైన సీసీ రోడ్లు నిర్మించడం, విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేయడం, ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడం తన ప్రధాన ప్రాధాన్యతలని తెలిపారు.అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకం అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా బాధ్యతగా పనిచేస్తానని పేర్కొన్నారు.గ్రామంలోని మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు యువతకు ప్రోత్సాహం, మహిళలకు గౌరవం, వృద్ధులకు అండగా నిలవడం, పేద కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానన్నారు.పదవిని బాధ్యతగా భావించి, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ దేవారం పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తన సంకల్పమని తుర్రం రామస్వామి తెలిపారు. గ్రామ ప్రజలందరూ తనకు అండగా నిలిచి అఖండ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అదుపులోకి వచ్చిన ఓఎన్ జీసీ గ్యాస్ లీకేజీ



కోనసీమ ఓఎన్జీసీ గ్యాస్ లీకేజీ అదుపులోకి వచ్చింది. తాడిమెరక రీడ్రిల్లింగ్ పాయింటులో మంగళవారం ఉదయం గ్యాస్ లీకైయింది. గ్యాస్ లీకేజీ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా అధికారులతో మాట్లాడారు. గ్యాస్ లీకేజీ అదుపులోకి తీసుకొచ్చేంత వరకు ఆర్టీజీఎస్ నుంచి నిరంతర పర్యవేక్షణ చేసారు. జిల్లా అధికారుల సమన్వయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు చర్యలు తీసుకుంది. ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రికి పరిస్థితిని న అధికారులు వివరించారు. సాయంత్రానికి గ్యాస్ లీకేజీని అరికట్టారు. ప్రజలు ఎవ్వరూ ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెప్పారు.

సోలార్ పనులు వేగవంతం చేయాలి

- నెలాఖరులోగా లక్ష్యాలు పూర్తి చేయాలి..



నంద్యాల, నవంబరు 17: పీఎం సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు పనులను వేగవంతం చేసి, ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యుత్ శాఖ అధికారులతో పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు.నంద్యాల డివిజన్‌లో పనులు వంద శాతం పూర్తయ్యాయని, డోన్ డివిజన్‌లో 5,427, ఆత్మకూరు డివిజన్‌లో 5,281 పనులు ఇంకా పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. కాంట్రాక్టు సంస్థలతో సమన్వయం చేసుకుని మిగిలిన పనులను గడువులోగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు ఈఈలు పాల్గొన్నారు.

రాజకీయ అండదండలతో అక్రమ నిర్మాణం.?

- అయ్యప్ప సొసైటీలో ప్లాట్ నెం.144లో 7, 8 అంతస్తుల భవనం - అధికారుల అండతో బిల్డర్ తీరుపై ఆరోపణలు



శేర్లింగంపల్లి(ప్రశ్న న్యూస్)శేర్లింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో ఇప్పుడు ఒకే చర్చ ప్లాట్ నంబర్ 144లో లేస్తున్న భారీ భవనం చట్టబద్ధమా.? అక్రమమా.? ఇన్ని అంతస్తుల అనుమతులు ఉన్నాయా.?స్థానికులు ఆరోపనల ప్రకారం, బిల్డర్ మన్యం అక్కడ ఏకంగా ఏడు, ఎనిమిది అంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. సొసైటీలోని ఇతర ఇళ్లు రెండు, మూడు అంతస్తులకే పరిమితమై ఉండగా, ఈ ఒక్క భవనం మాత్రం ఆకాశాన్ని తాకుతోందని కాలనీవాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులను సైతం లెక్కచేయడం లేదా.?

ఈ నిర్మాణంపై మాదాపూర్ సర్కిల్, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఫిర్యాదులు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అయినా నిర్మాణ పనులు అసలు ఆగలేదని, అదే వేగంతో కొనసాగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపల్ శాఖ నిబంధనలు అందరికీ ఒకటేనా.? పెద్దవాళ్లకు ఒకటా? లంచాలు ఇస్తే మరోటా అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు. పర్మిషన్ ఎన్ని అంతస్తులకు ఉంది.? సెట్‌బ్యాక్స్ పాటించారా.? పార్కింగ్, ఫైర్ సేఫ్టీ, రోడ్డు వెడల్పు నిబంధనలు ఏమయ్యాయి.? అనే ప్రశ్నలకు డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ ఎసిపి, సెక్షన్ ఆఫీసర్ సమాధానం చెప్పాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రాజకీయ అండ ఉంది అన్న ఆరోపణ.?

తనకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయని, ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతోనే బిల్డర్ నిర్మాణం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల్లో నిజానిజాలు అధికారుల విచారణలో తేలాల్సి ఉంది. కానీ ప్రజల్లో మాత్రం “అధికారం ఉంటే అక్రమం కూడా సక్రమం అవుతుంది” అనే భావన బలపడుతోంది. ఇది పాలన వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తోంది. డిప్యూటీ, జోనల్ కమిషనర్ వెంటనే స్పందించి కూల్చి వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కాలనీకి ముప్పు ఏంటి.?

ఇంత పెద్ద భవనం వస్తే కాలనీలో ట్రాఫిక్, నీటి సమస్య, డ్రైనేజీ, పార్కింగ్ సమస్యలు పెరుగుతాయని స్థానికులు భయపడుతున్నారు. పక్క ఇళ్లకు వెలుతురు, గాలి ఆగిపోతుందని, భవనం బరువుకు భూగర్భ జలాలు, పునాదులు దెబ్బతింటాయని వారు ఆందోళన చెందుతున్నారు.

జీహెచ్ఎంసీ, టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్పందించి, సైట్ ను పరిశీలించి, నిజాలు ప్రజల ముందు పెట్టాలి. లేదంటే “రాజకీయ అండ ఉంటే ఏ అక్రమమైనా చెల్లుతుంది” అన్న సంకేతం మాదాపూర్ మొత్తానికి వెళుతుందని, దీంతో ప్రభుత్వ ఆదాయానికి పూర్తిగా కాకుండా అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

స్థానికుల డిమాండ్..

1. ప్లాట్ నెం.144 నిర్మాణానికి ఉన్న అనుమతులను బహిరంగపరచాలి
2. అనుమతికి మించి నిర్మిస్తే వెంటనే పనులు నిలిపివేయాలి
3. నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ అయితే బిల్డర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
4. ఈ విషయంలో ఏ అధికారి నిర్లక్ష్యం చేసినా వారిపైనా చర్యలు తీసుకోవాలి

చదువు ఉన్నత శిఖరాలకు తొలిమెట్టు



కంటోన్మెంట్(ప్రశ్న న్యూస్) తరగతి గదులే రేపటి భారతావని తలరాతను మార్చే కీలక వేదికలు.బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడంలో దేశ ప్రగతిని పరుగులు పెట్టించడంలో నాణ్యమైన విద్యకు మించిన శక్తి మరొకటి లేదు. పోటీ ప్రపంచంలో కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా,పిల్లలలో సృజనాత్మక ఆలోచనలు,సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాల్య దశ నుండే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చడం ద్వారా,వారిని భవిష్యత్తులో గొప్ప ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దవచ్చు.ఆర్థిక అసమానతలను రూపుమాపి,ప్రతి కుటుంబాన్ని పేదరికం నుండి బయటపడేసే ఏకైక సాధనం చదువుతో మాత్రమే సాధ్యమవుతుంది. సాంకేతికత వేగంగా మారుతున్న ప్రస్తుత తరుణంలో,విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా మన దేశం ప్రపంచ వేదిక పై అగ్రగామిగా నిలవగలదు.గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి బిడ్డకు కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తెచ్చినప్పుడే నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుంది. చదువుతో పాటు క్రమశిక్షణ,మానవతా విలువలు సామాజిక బాధ్యతను నేర్పించడం వల్ల నేర రహిత సమాజ నిర్మాణం జరుగుతుంది.ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా రాబోయే తరాల ఆరోగ్యం,ఆర్థిక స్వావలంబన మెరుగుపడతాయి. నిరుద్యోగ సమస్యను అధిగమించి,యువతను ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించే శక్తి కేవలం నైపుణ్యాధారిత విద్యకే ఉంది.పర్యావరణ పరిరక్షణ నుండి అంతరిక్ష పరిశోధనల వరకు ప్రతి రంగంలోనూ మన దేశం సత్తా చాటాలంటే,నేటి బాలలకు పటిష్టమైన విద్యాకు పునాదులు వేయాలి.తల్లిదండ్రులు మార్కుల వేటను పక్కన పెట్టి,పిల్లల సహజ సిద్ధమైన ఆసక్తులను గుర్తించి ప్రోత్సహించాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం,ఉపాధ్యాయుల శిక్షణపై పెట్టే ప్రతి రూపాయి దేశ భవిష్యత్తుపై చేసే అత్యుత్తమ పెట్టుబడిగా మారుతుంది.విద్య అనేది కేవలం వ్యక్తిగత ఎదుగుదలకు మాత్రమే కాకుండా,ఒక బలమైన భారతాన్ని నిర్మించడానికి ప్రధాన ఆయుధం. సమాజంలోని అన్ని వర్గాల వారు చేతులు కలిపి,బడి బయట ఉన్న ప్రతి చిన్నారిని తిరిగి తరగతి గదికి చేర్చాల్సిన బాధ్యత మానపై ఉంది.చివరగా, తరగతి గదులలో వికసించే విద్యా కుసుమాలే రేపటి దేశాభివృద్ధికి వెలుగు దివ్వెలుగా మారతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

ప్రభుత్వ బడుల “రూపురేఖలు మారుస్తాం” ఎమ్మెల్యే శ్రీగణేష్.

లాల్‌బజార్ బాలికల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ.

రూ. 20 లక్షల అభివృద్ధి పనుల పరిశీలన.

సామాన్య,మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందిచయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్పష్టం చేశారు. నిన్న ఆయన తిరుమలగిరి లాల్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి,అక్కడి పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా రూ. 20 లక్షల అంచనా వ్యయంతో పాఠశాలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించారు.విద్యార్థినుల సౌకర్యార్థం నిర్మించిన మధ్యాహ్న భోజనశాల షెడ్డు,స్వచ్ఛమైన తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్,నిరంతర విద్యుత్ సరఫరా కోసం బిగించిన సోలార్ ప్లాంట్ పనితీరును అడిగి తెలుసుకున్నారు.బాలికల సంఖ్యకు అనుగుణంగా అదనపు మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు,క్రీడలను ప్రోత్సహించేందుకు బాస్కెట్‌బాల్,రింగ్‌బాల్ కోర్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని గుత్తేదారులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని సర్కారు బడులన్నింటినీ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ప్రత్యేక నిధులు మంజూరు చేయించి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. పేదరికాన్ని జయించడానికి విద్య ఒక్కటే ఆయుధమని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో శ్రమించి కలెక్టర్లు, ఐపీఎస్‌లు,డాక్టర్లు, ఇంజనీర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు.విద్యార్థుల ఆరోగ్యం,చదువుపై శ్రద్ధతో సీఎం ఉదయం అల్పాహారం,మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేస్తున్నారని కొనియాడారు. త్వరలోనే నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని ప్రకటించారు.పాఠశాల ఆవరణ వెలుపల అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను చూసిన శ్రీ గణేష్,తక్షణమే తిరుమలగిరి ట్రాఫిక్ పోలీసులకు ఫోన్ చేసి వాటిని తొలగింపజేశారు. అలాగే,బడి పరిసరాల్లో అపరిశుభ్రతకు కారణమవుతున్న చెత్తకుండీని వెంటనే అక్కడి నుంచి తరలించాలని కంటోన్మెంట్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, కాంగ్రెస్ వార్డు అధ్యక్షుడు మురళి ముదిరాజ్, నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల వైద్యానికి ఆపన్నహస్తం:

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీగణేష్.కంటోన్మెంట్‌లో 69 మంది బాధితులకు రూ.33.42 లక్షల ఆర్థిక సాయం.ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత.కార్పొరేట్ స్థాయి వైద్య ఖర్చులు భరించలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఒక సంజీవనిలా పనిచేస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని అనారోగ్య బాధితులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు మంగళవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే,మొత్తం 69 మంది లబ్ధిదారులకు రూ.33,42,500 విలువైన చెక్కులను స్వయంగా అందజేశారు.చెక్కుల పంపిణీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో శ్రీగణేష్ ప్రసంగిస్తూ,రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని కొనియాడారు. అనుకోని అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు పేద కుటుంబాలు అప్పుల పాలు కాకూడదనే సదుద్దేశంతో సీఎంఆర్ఎఫ్ ద్వారా తక్షణ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు ఆయన వివరించారు.ఆపద సమయంలో ప్రభుత్వమే తమకు అండగా ఉందనే ధైర్యాన్ని ప్రతి పేదవాడిలో నింపడమే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. నియోజకవర్గ ప్రజల కష్టసుఖాల్లో తాను ఎప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

కంటోన్మెంట్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి అందేలా నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఒకే సారి 69 మంది బాధితులకు రూ.33.42 లక్షల మేర ఆర్థిక సాయం అందజేయడం పట్ల లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మళ్లీ బీఆర్ఎస్ రావాలి..
కేసీఆర్ సీఎం కావాలి



తెలంగాణలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ చేపట్టిన ఏడుపాయల?ఎర్రవల్లి పాదయాత్ర రెండో రోజుకు చేరుకుంది. మెదక్ జిల్లా కల్వకుంట్ల సర్పంచ్ అందె కొండల్ రెడ్డి, శంకరంపేట మాజీ సర్పంచ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాదయాత్రను కొనసాగిస్తున్నారు. తొలిరోజు ఏడుపాయల శ్రీ వనదుర్గ భవానీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాత్రను ప్రారంభించారు. కేసీఆర్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని, మరోసారి ముఖ్యమంత్రి కావాలని అమ్మవారిని ప్రార్థించారు. అదే సంకల్పంతో రెండో రోజు కూడా పాదయాత్రను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందని తెలిపారు. తెలంగాణకు మళ్లీ పూర్వ వైభవం రావాలంటే కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆకాంక్షించారు. ఏడుపాయల వనదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులతో పాదయాత్ర విజయవంతంగా పూర్తికావాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ పాదయాత్రలో మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ గౌడ్, రజక్‌పల్లి సర్పంచ్ కనకరాజు, బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకులు గంజి నవీన్ శ్రీనివాస్, బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు మావురం రాజు, వార్డు సభ్యుడు పంపరి నాగేష్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన నాయకులు వినయ్, ప్రవీణ్, సాయి, విల్సన్, సల్మాన్, అంతేలి నాగరాజు, కనుక రాజు, రమేష్, స్వామి, రాజు, శేఖర్, శ్రీకాంత్, నరేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మంది ఇంచార్జులపై జగన్ వేటు !?

కడప : ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో సంస్థాగత ప్రక్షాళన అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాష్ట్రంలోని సుమారు 80 నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌ల పనితీరు ఆశించిన స్థాయిలో లేదంటూ అధిష్టానానికి నివేదికలు అందాయి. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం పార్టీ కీలక నేతలతో అత్యవసరంగా సమావేశం కానున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాలను నడిపించడంలోనూ, కూటమి ప్రభుత్వంపై పోరాటాలు చేయడంలోనూ పలువురు ఇన్‌ఛార్జ్‌లు పూర్తిగా నిస్తేజంగా వ్యవహరిస్తున్నారన్న అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.పనితీరు సరిగా లేని వారిని పక్కన పెట్టి, వారి స్థానంలో కొత్త ఇన్‌ఛార్జ్‌లను నియమించే అంశంపై భేటీలో కీలక చర్చ జరిగే అవకాశం ఉంది.అయితే, ఇన్‌ఛార్జ్‌ల మార్పు అనేది పైకి కనిపించినంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు , పార్టీ అంతర్గత వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రస్తుత ప్రతిపక్ష పరిస్థితుల్లో నియోజకవర్గ బాధ్యతలు తీసుకుని, పార్టీ కార్యక్రమాల కోసం సొంతంగా ఆర్థిక భారం భరించే నాయకులను వెతకడం అధిష్టానానికి పెద్ద సవాలుగా మారింది. ఎంతో కష్టం మీద అక్కడక్కడా ఆర్థికంగా బలమైన నేతలను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించినప్పటికీ, ఇప్పుడు వారిపై వేటు వేస్తే ఆయా నియోజకవర్గాల్లో బాధ్యతలు తీసుకునేందుకు మరొకరు ముందుకు రావడం కష్టమన్న ఆందోళన పార్టీ పెద్దల్లో నెలకొంది.కొంతమంది నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు తమ వ్యాపార, వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికార టీడీపీ నేతలతో లోపాయికారీ ఒప్పందాలు చేసుకున్నారన్న స్పష్ట మైన సమాచారం అధిష్టానానికి అందినట్లు ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో వారిని బయటకు పంపితే నియోజకవర్గాల్లో పార్టీ ఉనికి మరింత బలహీనపడు తుందన్న ఉద్దేశంతో, అలాంటి నేతల విషయంలో కూడా కఠిన చర్యలు తీసుకోకుండా అధిష్టానం చూసీచూడనట్లు వదిలేసే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారుఈ అంశంపై వైసీపీ వర్గాలు మాత్రం భిన్నమైన వాదనను వినిపిస్తున్నాయి. పార్టీలో ఎవరికీ మినహా యింపు ఉండదని, క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేసే వారికే భవిష్యత్తులో గుర్తింపు లభిస్తుందని, నివేదికల ఆధారంగా అవసరమైన చోట్ల కచ్చితంగా మార్పులు ఉంటాయని వారు స్పష్టం చేస్తున్నారు.

రూఫ్ పున: ప్రారంభం పథకం అమలు

హైదరాబాద్ : గతంలో వివిధ కారణాలతో మధ్యలోనే ఆగిపోయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'రూఫ్ పునఃప్రారంభం' అనే ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు గెజిటెడ్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారు.రాష్ట్రంలో 2006 నుంచి 2013 మధ్య మంజూరైన పాత ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాల కింద సుమారు 4.52 లక్షల ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయినట్లు అధికారులు గతంలోనే గుర్తించారు. అలాగే, 2023లో గృహలక్ష్మి పథకం కింద ప్రారంభమైన మరో 9,741 ఇళ్ల పనులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి. ప్రస్తుతం వీటిలో చాలా ఇళ్లు పునాదులు, గోడల దశలో ఉండగా, మరికొన్నింటికి రేకులు లేదా రాతి పలకలతో తాత్కాలిక పైకప్పులు వేసుకున్నారు.ఇలాంటి ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో భాగంగా శాశ్వత శ్లాబ్ వేసుకుని నిర్మాణం పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందుకోసం గ్రేటర్ హైదరాబాద్ మినహా రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున మొత్తం 48,590 ఇళ్లను మంజూరు చేయాలని నిర్ణయించి, రూ. 1,400 కోట్ల నిధులను కేటాయించింది.

ఈ పథకం కింద ఎంపికైన ప్రతి లబ్ధిదారుడికి రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందనుంది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 48 వేల మంది లబ్ధిదారులను గుర్తించాల్సి ఉండగా, ఇప్పటి వరకు అధికారులు 24,298 ఇళ్ల వద్దకు వెళ్లి సర్వే పూర్తి చేశారు. ఇందులో 6,198 మందిని అర్హులుగా తేల్చి జాబితాను సిద్ధం చేశారు. మిగిలిన దరఖాస్తులు అనుమతుల కోసం వివిధ దశల్లో ఉన్నాయి.

మూడు అగ్రనేతల భేటీ

ముంబై : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ , రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ గురువారం భేటీ కాబోతున్నారు. వచ్చే వారం జరగనున్న ఆసియా-పసిఫిక్ ఎకనమిక్ సమ్మిట్ సందర్భంగా ఈ ముగ్గురు ప్రపంచ నేతలు కలిసి చర్చలు జరపబోతున్నారు. చైనా టెక్ హబ్‌గా పేరొందిన షెంజెన్ నగరం దీనికి వేదిక కానుంది. ముగ్గురు అగ్రనేతలు కలవడం అనేది అరుదైన ఘట్టమే అయినప్పటికీ.. ఈ చర్చల వల్ల వచ్చే ఫలితం మాత్రం పెద్దగా ఉండకపోవచ్చనే అంచనాలు ఉన్నాయి.గత ఏడాది అమెరికా-చైనా మధ్య వాణిజ్య యుద్ధం జరిగింది. అమెరికా సుంకాలు విధించగా.. చైనా కూడా ప్రతీకార సుంకాలు విధించింది. ఈ పరిస్థితుల్లో ట్రంప్ అమెరికా పర్యటనకు వెళ్లగా.. ఈ విభేదాలను పక్కనబెట్టి ఆయనకు జిన్‌పింగ్ సాదర స్వాగతం పలికారు. ట్రంప్ ఇప్పుడు మరోసారి చైనా పర్యటనకు వెళ్తున్నారు.అమెరికా, రష్యా మధ్య అణ్వాయుధ ఒప్పందం 'న్యూ స్టార్ట్' ఫిబ్రవరిలో ముగిసింది. ఈ ఒప్పందాన్ని మరో రెండేళ్లు పొడిగించాలని పుతిన్ కోరినప్పటికీ.. ట్రంప్ తిరస్కరించారు. దానికి బదులుగా చైనాను కూడా కలుపుకొని మరో కొత్త, మెరుగైన ఒప్పందాన్ని చేసుకుందామని ఆయన ప్రతిపాదించారు.అయితే అమెరికా, రష్యాల వద్ద చెరో 5 వేలకుపైగా అణ్వాస్త్రాలు ఉన్నాయి. చైనా దగ్గర 600 అణ్వాయుధాలు మాత్రమే ఉన్నాయి. అమెరికా, రష్యాతో పోలిస్తే తమ దగ్గర ఉన్న అణ్వాయుధాలు తక్కువ కావడంతో.. ఈ రెండు దేశాలతో అణు ఒప్పందం చేసుకోవడం పట్ల చైనా ఆసక్తి చూపడం లేదు.పుతిన్, జిన్‌పింగ్ మధ్య బలమైన స్నేహ సంబంధాలు ఉన్నాయి. 2013లో జిన్‌పింగ్ చైనా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వీరిద్దరూ ఇప్పటి వరకు 40 సార్లకుపైగా కలుసుకున్నారు.

చైనా, రష్యా మధ్య బలమైన వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. మరోవైపు ట్రంప్, జిన్‌పింగ్ సైతం ఏడు సందర్భాల్లో భేటీ అయ్యారు. ఈ ఏడాది సెప్టెంబర్లో జిన్‌పింగ్ వాషింగ్టన్ పర్యటనకు వెళ్లారు.డొనాల్డ్ ట్రంప్ ఇటీవల రష్యాతో డీజిల్ కొనుగోలు కోసం ఒప్పందం చేసుకున్నారు. మాస్కోపై ఆంక్షలు ఎత్తివేసిన ట్రంప్.. భారీగా ఇంధనం ఎగుమతి చేయడానికి రష్యాకు అవకాశం ఇచ్చారు. రష్యా ఆయిల్ రిఫైనరీలపై ఉక్రెయిన్ దాడులు చేస్తుండటంతోనే ఇంధన ధరలు పెరుగుతున్నాయని ట్రంప్ ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్ భేటీ అవుతుండటంతో.. తమ ప్రమేయం లేకుండానే ఉక్రెయిన్ ఒప్పందం గురించి చర్చ జరిగే అవకాశం ఉందని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన చెందుతున్నారు.పసిఫిక్ మహా సముద్రం తీర ప్రాంత దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించడం, ప్రాంతీయ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార కూటమి 1989లో ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రాలో ఏర్పాటైంది. ఆస్ట్రేలియా, బ్రూనై, ఇండోనేసియా, న్యూజిలాండ్, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్, మలేసియా, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్‌తోపాటు అమెరికా, కెనడా దేశాలు ఈ కూటమిలో వ్యవస్థాపక సభ్య దేశాలుగా ఉన్నాయి. 1991 నుంచి 1998 మధ్య చైనా, తైవాన్, హాంగ్‌కాంగ్, మెక్సికో, రష్యా, చిలీ, పెరూ, పాపువా న్యూ గినియా, వియత్నాం చేరడంతో సభ్య ఆర్థిక వ్యవస్థల సంఖ్య 21కి చేరింది.ంఖఇఅలో భారత్ సభ్యదేశం కాదు. ఈ కూటమిలో చేరేందుకు 1991లోనే భారత్ దరఖాస్తు చేసుకుంది. కానీ భారత్ హిందూ మహా సముద్ర ప్రాంత దేశమని, పసిఫిక్ మహాసముద్ర తీర ప్రాంత దేశం కాదనే సాకుతో చేర్చుకోలేదు. దీంతో ఈ కూటమి సమావేశాలకు అధిగా ఆహ్వానిస్తే తప్పితే భారత్ హాజరు కావడం లేదు. 2014లో ప్రత్యేక అతిథిగా ఈ సమావేశానికి హాజరు కావాలని జిన్‌పింగ్ తొలిసారిగా ఆహ్వానించారు. అయితే ప్రధాని మోదీ హాజరు కాలేదు. 2023లో అమెరికా ఆతిథ్యం ఇచ్చిన సదస్సుకు కూడా భారత్‌కు ఆహ్వానం అందింది. ఆ సదస్సులో మోదీకి బదులుగా వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ హాజరయ్యారు. సమావేశాలు 2026 నవంబర్ 16-18 తేదీల మధ్య చైనాలో జరుగుతుండగా.. ప్రధాని మోదీ దాదాపు అదే సమయంలో పిలిప్పిన్స్ రాజధాని మనీలాలో జరగనున్న ఏసియాన్-ఇండియా సదస్సుతోపాటు ఈస్ట్ ఆసియా శిఖరాగ్ర సమావేశాల్లో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. యాక్ట్ ఈస్ట్ విధానంలో భాగంగా ఈ సదస్సులకు భారత్ అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ట్రంప్-జిన్‌పింగ్-పుతిన్ భేటీ కాబోతున్న షెన్‌జెన్, ఆసియాన్ సదస్సు జరగనున్న మనీలా నగరాల మధ్య దూరం 1200 కి.మీ. లోపే కావడం గమనార్హం.

లాడ్జీలో ఘర్షణ.. యువకుడు మృతి

భద్రాద్రి కొత్తగూడెం భద్రాచలంలో దారుణం జరిగింది. రూమ్ కోసం వెళ్లిన యువకులపై లాడ్జి సిబ్బంది దాడి చేసారు. మాటో, స్విగ్గీలో పనిచేస్తున్న నలుగురు యువకులు రూమ్ కోసం ప్రైవేట్ లాడ్జికి వెళ్లారు. ఆధార్ కార్డులు అడగడంతో యాజమాన్యానికి, యువకులకు మధ్య వివాదం చెలరేగింది. నలుగురిలో ఒక్కరే ఆధార్ కార్డు చూపించగా.. మిగిలిన వారు నిరాకరించారు. దాడిలో తెల్లం శరత్ (23) అనే యువకుడు మృతి చెందాడు. మృతుడు అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపుల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మరో ఇద్దరు యువకులపై కూడా దాడి జరిగింది. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ఓటీటీకి తమిళ రొమాంటిక్

యాక్షన్ థ్రిల్లర్!



ఓటీటీ ట్రాక్ పైకి అడుగుపెట్టడానికి ఒక తమిళ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ సిద్ధమవుతోంది. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ జోనర్ లో రూపొందిన సినిమాలను చూడటానికి యూత్ ఎక్కువగా ఇంట్రెస్ట్ చూపిస్తుంది. లవ్ .. రొమాన్స్ .. యాక్షన్ తో థ్రిల్ చేసే ఈ తరహా సినిమాలకు ఓటీటీలలో విశేషమైన ఆదరణ లభిస్తూ ఉంటుంది. అందువల్లనే ఈ తరహా కంటెంట్ ను ఆవిష్కరించడానికి ఓటీటీ సెంటర్లు పోటీపడుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో 'సోనీ లివ్' ద్వారా పలకరించబోతున్న సినిమానే 'అన్బిల్ అవన్'. కరుణ మూర్తి – అభినయ సెల్వన్ నిర్మించిన ఈ సినిమాకి, కార్తికేయన్ దర్శకత్వం వహించాడు. అశోక్ సెల్వన్ – ప్రీతిముకుందన్ ప్రధానమైన పాత్రలను పోషించిన ఈ సినిమాలో, రేవతి .. ధిల్లీ గణేశ్ .. కదిర్ బాలు ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు. గోవింద్ వసంత సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, అక్టోబర్ 2వ తేదీన థియేటర్లలో విడుదలైంది. అలాంటి ఈ సినిమా, ఈ నెల 20వ తేదీ నుంచి నుంచి 5 భాషల్లో 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ కానుంది. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చేసింది. సూర్య .. ఇయల్ ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. ఇద్దరూ సరదాగా గడపాలని అనుకుంటారు. అందుకోసం ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా, హిల్ స్టేషన్ లో ఒక ఖరీదైన ఇంటిని సూర్య కొనుగోలు చేస్తాడు. ఇద్దరూ కలిసి అక్కడికి వెళతారు. ఆ ఇల్లు .. ఆ పరిసరాలు చూసి ఇయల్ సంబరపడిపోతుంది. అయితే ఆ సంతోషం ఎక్కువసేపు నిలవదు. తాము చాలా పెద్ద ప్రమాదంలో చిక్కుకున్నామనే విషయం అర్థం కావడానికి వాళ్లకి కాస్త సమయం పడుతుంది. ఆ ప్రమాదం ఏమిటి? ఆ ఇంటిని .. భార్యను రక్షించుకోవడం కోసం సూర్య ఏం చేయవలసి వస్తుంది? అనేదే కథ.

పెట్టింది 2 కోట్లు .. తెచ్చింది 154 కోట్లు!




చాలా తక్కువ బడ్జెట్ లో నిర్మితమైన సినిమాలు సంచలన విజయాలను సాధించడం .. రికార్డు స్థాయి వసూళ్లను రాబట్టడం మలయాళ సినిమాల విషయంలో ఎక్కువగా జరుగుతూ ఉంటుంది. అయితే అప్పుడప్పుడు ఆ తరహా విన్యాసాలను కన్నడ సినిమాలు చేయడం కూడా మనకి కనిపిస్తుంది. అలా వచ్చిన ఒక సినిమానే 'ప్రేమద ఊరలి'. ఫ్యామిలీ ఎమోషన్స్ తో కూడిన మ్యూజికల్ డ్రామా ఇది. మనోజ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రంగాయన రఘు .. శ్రీరామ్ .. తపస్విని ప్రధానమైన పాత్రలను పోషించారు. ఈ ఏడాది సెప్టెంబర్ 25వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, తొలి ఆటతోనే హిట్ టాక్ తెచ్చుకుంది. విడుదలైన ప్రతి ప్రాంతంలో విజయవిహారం చేసింది. అక్కడి ఫ్యామిలీ ఆడియన్స్ ఈ సినిమాను గురించే మాట్లాడుకున్నారు. కేవలం 2 కోట్ల బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, చాలా తక్కువ సమయంలో 100 కోట్ల క్లబ్ లో చేరిపోయింది. ఆ ఆశ్చర్యం నుంచి తేరుకునేలోగా 150 కోట్ల మార్కును దాటేసింది. అంతేకాదు ఈ ఏడాది ఇంతవరకూ విడుదలై భారీ వసూళ్లను సాధించిన కన్నడ సినిమాలలో రెండో స్థానంలో నిలిచింది. బడ్జెట్ పరంగా ఒక చిన్న సినిమా, బలమైన కంటెంట్ ఉంటే ఎలా దూసుకుపోతుందనేది ఈ సినిమా మరోసారి నిరూపించింది. భారీ బడ్జెట్ .. వివిధ భాషలకి చెందిన స్టార్స్ .. పెద్దఎత్తున పబ్లిసిటీ లేకపోయినా ఈ సినిమా తన సత్తా చాటుకుంది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు 'అమెజాన్ ప్రైమ్'లో అడుగుపెట్టింది. కన్నడతో పాటు తెలుగు .. తమిళ .. మలయాళ .. హిందీ భాషలలో ఈ రోజు (నవంబర్ 17) నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ ను ఈ సినిమా ఒక రేంజ్ లో ఆకట్టుకునే అవకాశాలైతే ఉన్నాయి.

'ప్రేమద ఊరలి' (అమెజాన్ ప్రైమ్) మూవీ రివ్యూ!



కన్నడలో ఇటీవల రూపొందిన ఒక చిన్న సినిమా, అక్కడి బాక్సాఫీస్ బద్ధకాన్ని వదిలించి వేసింది. ఆ సినిమా పేరే 'ప్రేమద ఊరలి'. కేవలం రెండు కోట్ల రూపాయల బడ్జెట్ తో నిర్మితమైన ఈ సినిమా, 150 కోట్లకి పైగా వసూళ్లను రాబట్టింది. కదిలించే కంటెంట్ ఉంటే, స్టార్స్ లేకపోయినా విశేషమైన ప్రేక్షకాదరణ లభిస్తుందని నిరూపించిన సినిమా ఇది. అలాంటి ఈ సినిమా 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. కన్నడతో పాటు తెలుగు .. తమిళ .. మలయాళ .. హిందీ భాషలలో ఈ రోజు (నవంబర్ 17) నుంచి అందుబాటులోకి వచ్చింది. అది ఒక అందమైన పల్లెటూరు. ఆ ఊళ్లో తనకున్న పొలాన్ని సాగుచేసుకుంటూ 'నాగన్న' (రంగాయన రఘు) నివసిస్తూ ఉంటాడు. భార్య చనిపోవడంతో కొడుకు 'సంతోష్' (శ్రీరామ్) ఆలనా పాలన తానే చూస్తూ పెంచుతాడు. ఈ విషయంలో అతనికి అత్తగారు సహకరిస్తుంది. సంతోష్ ను గారంగా పెంచడం వలన అతనికి పెద్దగా చదువు అబ్బదు. అందువలన బాగా చదువుకున్న అమ్మాయినే కోడలిగా తెచ్చుకోవాలని నాగన్నకు ఉంటుంది. నాగన్న చెల్లెలు 'రాజీ' ఆత్మహత్య చేసుకుని చనిపోతుంది. ఆ సంఘటనను తలచుకుని అప్పుడప్పుడు అతను చాలా బాధపడుతూ ఉంటాడు. అలాగే తన కొడుకును ప్రేమగా చూసుకోవాలనే ఉద్దేశంతో అతను మళ్లీ పెళ్లి చేసుకోడు. అందువలన ఆ ఇంటికి ఆడతోడు కరువవుతుంది. ఆ ఊళ్లో నాగన్నని మామయ్య అని పిలుచుకుంటూ చలాకీగా ఉండే అమ్మాయి ఒక్క 'వసంత'నే. సంతోష్ దగ్గర కూడా ఆమెకి చాలా చనువు ఉంటుంది. ఆమెను కోడలిగా చేసుకోవాలనే ఒక ఆలోచన కూడా నాగన్నకి ఉంటుంది. సంతోష్ పెద్దగా చదువుకోకపోవడం వలన .. రైతులకు ఎవరూ పిల్లనివ్వకపోవడం వలన అతనికి పెళ్లి కాదేమోనని నాగన్న టెన్షన్ పడుతూ ఉంటాడు. ఈ సందర్భంలోనే పట్నానికి చెందిన అమ్మాయి రుక్మిణి, సంతోష్ కంటపడుతుంది. ఆ క్షణం నుంచి అతను ఆమెను ఆరాధించడం మొదలుపెడతాడు. ఆమె అడ్రెస్ వెతికి పట్టుకునే పనిలో పడతాడు. ఈ నేపథ్యంలో తనకి సంతోష్ పై ఉన్నది ప్రేమ అని గ్రహించిన వసంత, తన మనసులోని మాటను అతనికి చెప్పడానికి సిద్ధమవుతుంది. అలాంటి పరిస్థితులలో తండ్రితో కలిసి ఒక పెళ్లికి వెళతాడు సంతోష్. సంబంధం చెడిపోయి పీటలపై కూర్చున్న రుక్మిణిని చూసి బిత్తరపోతాడు. ఆమె మెడలో తాళి కట్టి ఇంటికి తీసుకొస్తాడు. ఆ తరువాతనే అతనికి రుక్మిణి గురించిన ఒక విషయం తెలుస్తుంది. అదేమిటి? అప్పుడు సంతోష్ ఏం చేస్తాడు? తనకి అతను దక్కలేదనే బాధతో వసంత ఏం చేస్తుంది? నాగన్న ఫ్యామిలీలో ఆడవాళ్లకు చోటులేదు అనే ప్రచారానికి తెరపడుతుందా? అనేది మిగతా కథ. నాగన్న చేతిలో పసిబిడ్డను ఉంచి భార్య కన్ను మూస్తుంది. మళ్లీ పెళ్లి ఆలోచన లేకుండా ఆ బిడ్డను పెంచుతాడు నాగన్న. రైతులను పెళ్లి చేసుకోవడానికి .. పల్లెటూరు వెళ్లి ఉండటానికి ఇష్టపడని అమ్మాయిల కారణంగా అతనికి టెన్షన్ పట్టుకుంటుంది. తనకి దూరమైనా కొడుక్కి పెళ్లయితే చాలనుకునే నాగన్న .. తండ్రి నుంచి దూరం చేసే పెళ్లి తనకి అవసరం లేదని భావించే సంతోష్. ఈ ఇద్దరి చుట్టూ తిరిగే కథనే ఇది. పల్లెటూళ్లో తండ్రీకొడుకులుగా నాగన్న – సంతోష్ ల అనుబంధానికి అద్దం పట్టే సన్నివేశాలు, సంతోష్ .. అతని ఫ్రెండ్స్ ఆటపాటలు, అతనిని వసంత ఆరాధించడం .. అతనేమో రుక్మిణిని పెళ్లి చేసుకుని తీసుకురావడం వరకూ ఫస్టాఫ్ గా సాగుతుంది. ఇక పెళ్లయిన తరువాత రుక్మిణి – సంతోష్ లకు సంబంధించిన సన్నివేశాలు సెకండాఫ్ గా ఆడియన్స్ ను పలకరిస్తాయి. ఫస్టాఫ్ అంతా సరదాగా సాగిపోతే, సెకండాఫ్ ఎమోషన్స్ ను టచ్ చేస్తూ వెళుతుంది. 'ప్రేమద ఊరలి' అంటే 'ప్రేమ అనే ఊరిలో' అని అర్థం. దర్శకుడు ఈ కథ మొత్తాన్ని విలేజ్ నేపథ్యంలో నడిపించాడు. తన కుటుంబానికి కోడలిగా ఒక ఆడదిక్కు కావాలని ఆరాటపడే నాగన్న, భార్యగా తన జీవితంలోకి అడుగుపెట్టిన అమ్మాయి తనని ఎంతో ప్రేమగా చూసుకోవాలని భావించే సంతోష్ పాత్రలే ఈ కథకి రెండు కళ్లుగా చెప్పుకోవలసి ఉంటుంది. మొదటి నుంచి చివరి వరకూ ఈ రెండు పాత్రలను నడిపించడంలో దర్శకుడు సక్సెస్ అయ్యాడు. ఈ కథలో నెగెటివ్ షేడ్స్ తో కూడిన ఒక చిన్న పాత్ర తప్ప, విలన్ అంటూ ప్రత్యేకంగా ఉండదు. అయినా అలాంటి పాత్ర లేదనే ఆలోచన ఎక్కడా కలగదు. ఇటు తండ్రి .. అటు కొడుకు పాత్రలలో వ్యక్తిత్వం .. ఆదర్శం ఆడియన్స్ ను ఆకట్టుకుంటాయి. అలాగే వసంత పాత్ర వైపు నుంచి .. రుక్మిణి పాత్ర వైపు నుంచి అల్లుకొచ్చిన సన్నివేశాలు ఆలోచింపజేస్తాయి. ప్రతి పాత్ర వలన ప్రయోజనం కనిపిస్తుంది. ఆ పాత్రలతో డిజైన్ చేసిన దృశ్యాలలో సహజత్వం తొణికిసలాడుతుంది. కథ .. స్క్రీన్ ప్లే ఈ సినిమాకి ఎంతటి బలంగా నిలిచాయో, లొకేషన్స్ కూడా అంతే హైలైట్ గా నిలిచాయి. పాటలు కూడా ఇవే లొకేషన్స్ లో చిత్రీకరించడం వలన, నిజంగానే కథ అంతా ఒకే దగ్గర జరుగుతున్న ఫీలింగ్ కలుగుతుంది. ఈ లొకేషన్స్ లో శివాలయం .. అక్కడి దృశ్యాలు మరింతగా మనసుకు పట్టుకుంటాయి. ప్రీ క్లైమాక్స్ .. క్లైమాక్స్ దృశ్యాలు దాదాపు వర్షంలోనే ప్లాన్ చేయడం వలన అవి మరింత ఇంపాక్ట్ చూపిస్తాయి. రాజ్ కాంత్ ఫొటోగ్రఫీ చాలా బాగుంది. ప్రతి దృశ్యానికి ఆయన జీవం పోసినట్టుగా అనిపిస్తుంది. ఇక సునాద్ గౌతమ్ బాణీలు ఆకట్టుకుంటాయి. నేపథ్య సంగీతం సన్నివేశాలకు మరింత సపోర్ట్ చేస్తూ నిలబెడుతుంది. హర్షిత్ ప్రభు ఎడిటింగ్ కూడా మెప్పిస్తుంది. క్రికెట్ మ్యాచ్ ఎపిసోడ్ నిడివి కాస్త తగ్గిస్తే బాగుండునని మాత్రం అనిపిస్తుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన వాళ్లంతా, తమ పాత్రలకు న్యాయం చేశారు. ప్రతి సన్నివేశంలోను బలం కనిపిస్తుంది .. ఆత్మ కనిపిస్తుంది. ఫీల్ వర్కౌట్ అయింది. అందమైన కథను ఆహ్లాదకరమైన వాతావరణంలో చెప్పిన సినిమాగా ఇది ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మార్కులు కొట్టేస్తుందని చెప్పచ్చు.

బతికి బయటపడ్డాం



నవంబర్ 15 అర్ధరాత్రి బిగ్‌బీ అమితాబ్ తన ఎక్స్‌లో 'బతికి బయటపడ్డాం' అంటూ ఓ పోస్ట్ పెట్టారు. దేశవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు ఈ పోస్ట్ చూసి ఉలిక్కిపడ్డారు. అయితే.. అమితాబ్ ఎక్స్‌లో చేసిన ఈ వ్యాఖ్య వెనుక కారణం ఆయన వెల్లడించలేదు. అదే సమయంలో అమితాబ్‌పై దాడికి కుట్ర జరిసట్టు ఓ వార్త బయటకు రావడంతో అమితాబ్ పోస్ట్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత నెల రోజుల్లో మూడు పర్యాయాలు అమితాబ్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో ముంబై పోలీసులు ఆయన నివాసం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇదిలావుంటే.. ముంబయ్‌లోని బిగ్‌బీ నివాసమైన 'జల్సా' పరిసరాల్లో కాల్పులు జరిపేందుకు అండర్‌వరల్డ్ డాన్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా కుట్ర పన్నినట్లు ముంబై పోలీసుల తాజా దర్యాప్తులో తేలింది. ఈ కేసుకు సంబంధించిన ఇద్దరు అనుమానిత షూటర్లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

పెళ్లి తప్పనిసరి కాదు!



అగ్ర కథానాయిక శృతిహాసన్ ఏ విషయంలోనైనా నిర్మొహమాటంగా తన అభిప్రాయాల్ని వ్యక్తం చేస్తుంది. తాజాగా పెళ్లి గురించి ఈ భామ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ప్రతీ ఒక్కరి జీవితంలో తోడు ముఖ్యమేనని, అయితే అందుకోసం పెళ్లి చేసుకోవడం తప్పనిసరి కాదని అభిప్రాయపడింది. ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె ఈ విషయం గురించి మాట్లాడింది. 'పెళ్లికి నేను వ్యతిరేకం కాదు.

కానీ పెళ్లి కోసం పత్రాలపై సంతకాలు చేయడం, భారీగా డబ్బులు ఖర్చు పెట్టి వేడుకలు చేయడం ఎవరిని సంతృప్తిపరచడానికో అర్థం కాదు. నేను కొన్ని విషయాల్లో సంప్రదాయబద్ధంగా ఉంటాను. మరికొన్ని విషయాల్లో నా ఆలోచనలు ప్రాక్టికల్‌గా ఉంటాయి' అని శృతిహాసన్ చెప్పింది. శృతిహాసన్ గతంలో ఆర్టిస్టు శంతను హజారికాతో నాలుగేళ్ల పాటు ప్రేమలో ఉంది. 2024లో వ్యక్తిగత కారణాలతో ఇద్దరూ పరస్పర అంగీకారంతో విడిపోయారు. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి ప్రధాన పాత్రల్లో నటించిన 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో శృతిహాసన్ కీలక పాత్రను పోషిస్తున్న విషయం తెలిసిందే.

విభిన్న కథాంశంతో 'మన డాక్టర్ బాబే'



శ్రీస్కంద హీరోగా నటిస్తున్న చిత్రం 'మన డాక్టర్ బాబే'. మోహన సిద్ధి, శృతిశంకర్, అలీ, రాజీవ్ కనకాల, శాంతి, కోటేశ్వరరావు కీలక పాత్రధారులు. చలపతికుమార్ దర్శకుడు. కృతాక్షి నిర్మాత. ఈ నెల 20న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ప్రముఖ హీరో రాజ్‌తరుణ్ ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. హీరో శ్రీస్కంద తొలి సినిమా అయినా అద్భుతంగా నటించారని, నిర్మాత రాజీ లేకుండా సినిమాను నిర్మించారని, అందరూ మెచ్చే విభిన్న కథాంశంతో రూపొందిన ఈ సినిమా అందరికీ నచ్చుతుందని దర్శకుడు చలపతికుమార్ నమ్మకంగా చెప్పారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

కలల సాకారం కోసం



దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి జంటగా నటించిన చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించారు. ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేశారు. మహిళా సాధికారత ప్రధానాంశంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. 'మీ కలలు నిజం కావాలంటే ముందుగా మీరు కలలు కనాలి' అనే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ మాటలతో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. వ్యోయగామి కావాలనుకునే కల్పన అనే అమ్మాయి తన ఆశయాన్ని ఎలా నెరవేర్చుకుంది? ఈ క్రమంలో ఆమె ఎదుర్కొన్న ఇబ్బందులు, కలల సాకారం కోసం హీరో ఆమెకు తోడుగా నిలిచే సన్నివేశాలతో ట్రైలర్ ఆసాంతం స్ఫూర్తివంతంగా అనిపించింది. ఓ పల్లెటూరి అమ్మాయి తన కలల సాఫల్యం కోసం సాగించిన ప్రయాణం నేపథ్యంలో ట్రైలర్‌ను హృద్యంగా తీర్చిదిద్దారు. శృతిహాసన్, రుహానీ శర్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, రచన: గంగరాజు గుణ్ణం, దర్శకత్వం: పవన్ సాధినేని.

కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే జిఎంఆర్

గుండెపోటుతో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి

29 లక్షల రూపాయల నష్టపరిహారం అందజేత



పటాన్చెరు (ప్రశ్న న్యూస్)పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అండగా నిలిచారు. యజమాన్యంతో చర్చించి నష్ట పరిహారం అందించి కుటుంబానికి ఆర్థిక భరోసా అందించారు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన జి. దానయ్య.. గత కొంతకాలంగా పాశమైలారం పారిశ్రామికవాడలోని ల్యాం టఫ్ పరిశ్రమలో విధులు నిర్వహిస్తూ.. కుటుంబంతో కలిసి స్థానికంగా జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 5వ తేదీన.. పరిశ్రమలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో గుండెపోటుతో మృతి చెందాడు. ఈ అంశంలో న్యాయం చేయాలని కోరుతూ.. కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు విజ్ఞప్తి చేశారు. యాజమాన్యంతో చర్చించి.. మృతుడి కుటుంబానికి 29 లక్షల రూపాయలు నష్టపరిహారం మంజూరు చేయించారు. మంగళవారం పటాన్చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో.. మృతుడి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెక్కులను అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మినీ ఇండియాగా పేరొందిన పటాన్చెరు నియోజకవర్గంలో కార్మికుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం సంక్షేమ సంఘం నాయకులు భాస్కర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదల అభివృద్ధిలో కీలక ముందడుగు

నాలుగు కోట్ల 29 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రతి వార్డు అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి



గుమ్మడిదల (ప్రశ్న న్యూస్)గుమ్మడిదల మున్సిపల్ అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ.. ప్రతి వార్డును అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని అన్నారం, దోమడుగు, వీరన్న గూడెం, బొంతపల్లి, గుమ్మడిదల వార్డులలో నాలుగు కోట్ల 29 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో గల ప్రజలకు మెరుగైన పరిపాలన అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.అధికారులు, ప్రజాప్రతినిధులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనిలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ దశరథ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణ కాలుష్యంతో విజృంభిస్తున్న ప్రాణాంతక వ్యాధులు



సనత్‌నగర్ (ప్రశ్న న్యూస్) వాతావరణంలో వస్తున్న మార్పులు, పర్యావరణ కాలుష్యం కారణంగా ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని వాటిల్లుతుందని కామధేను ఫౌండేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్ అన్నారు. మంగళవారం నాడు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రెటరీ రవి నాయక్. ఐఏఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా సంభవిస్తున్న పలు అనారోగ్య సమస్యల నివారణ, పర్యావరణ కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై కామధేను ఫౌండేషన్ ద్వార చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, నివారణ చర్యలను వివరించారు. ముఖ్యంగా ఫ్యాక్టరీలు విడుదల చేసే విషపూరిత వ్యర్థాల వాయువులు, అడవుల నరికివేత, విపరీతమైన చెత్త ఉత్పత్తి, వాహనాల రద్దీ, విద్యుత్ ఉత్పత్తి, పెట్రోలియం ఉత్పత్తులను విచ్చలవిడిగా కాల్చడం, రసాయన పురుగు మందుల వాడకం, పంట వ్యర్థాలను దహనం చేయడం వంటి అనేక కారణాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని, దీంతో ఆస్తమా, శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు విజృంభిస్తున్నాయని హెచ్చరించారు. కార్బన్ డయాక్సైడ్ వంటి గ్రీన్‌హౌస్ వాయువుల వల్ల భూగోళం వేడెక్కుతుండటంతో అనేక మొక్కలు, జంతు జాతులు తమ సహజ ఆవాసాలను కోల్పోయి అంతరించిపోతున్నాయి అన్నారు. విరివిగా మొక్కలు నాటడం ద్వారా వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్‌ను తగ్గించవచ్చని, సింగిల్-యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. అలాగే వ్యక్తిగత వాహనాలకు బదులుగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఉపయోగించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు.

కుటుంబానికి అన్నీ తానై నిలిచిన ఆడబిడ్డ!

- తాత, అమ్మమ్మల సేవలో తరిస్తూ పెళ్లి కూడా చేసుకోకుండా త్యాగం..

- ఆఖరికి ఆమె తలదాచుకునే గూడుపైనే కన్ను

- రాజకీయ అండదండలతో ఏకపక్ష పంచాయతీ తీర్మానం!

- న్యాయం కోసం కన్నీరుమున్నీరవుతున్న ఒంటరి మహిళ సునీత



నల్గొండ (ప్రశ్న న్యూస్) ఆడపిల్ల అంటే ఇంటికి దీపం అంటారు, కానీ ఆ ఇంట్లో చీకట్లు కమ్ముకున్న వేళ తన జీవితాన్నే కొవ్వొత్తిలా కరిగించి వెలుగులు నింపిందా ఆడబిడ్డ. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి అనాథగా మిగిలిన ఆమెకు తాత, అమ్మమ్మలే లోకమయ్యారు. రెక్కలు ముక్కలు చేసుకుని, తన సొంత సంతోషాలను త్యాగం చేసి, చివరకు పెళ్లి ఊసే ఎత్తకుండా వారి సేవలోనే తరించింది. కన్నకొడుకు సైతం కనీసం అంత్యక్రియలకు రాని వేళ.. తాతకు తనే కొడుకై ముందుండి నడిచింది. ఇంతటి త్యాగం చేసిన ఆ ఒంటరి మహిళపై ఇప్పుడు ఆస్తి నాది అంటూ ఓ వ్యక్తి వస్తున్నాడు. 11 ఏళ్లుగా ఆమె పేరు మీద ఉన్న చిన్నపాటి ఇంటిని లాక్కునేందుకు కొందరు స్వార్థపరులు, రాజకీయ నాయకుల అండతో కుట్రలకు తెరలేపాడు. నల్గొండ జిల్లా చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో వెలుగుచూసిన ఈ హృదయవిదారక ఘటన ప్రతి ఒక్కరి కళ్లు చెమర్చేలా చేస్తోంది.

- అనాథగా మొదలైన ప్రస్థానం.. అంతులేని త్యాగం!

చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామం, విరాట్ నగర్ కాలనీకి చెందిన రాసోజు సునీత (40) జీవితం పుట్టుకతోనే కష్టాల కడలితో మటుదలైంది. చిన్నతనంలోనే అమ్మానాన్నల ప్రేమకు దూరమై అనాథగా మిగిలింది. ఆ సమయంలో ఆమెకు ఆసరాగా నిలిచింది తాత పోలోజు ముసలయ్య, అమ్మమ్మలు. వారి చేతుల్లో పెరిగిన సునీత, పెరిగి పెద్దయ్యాక వారినే తన ప్రాణంగా భావించింది. వృద్ధాప్యంలో ఉన్న వారికి అండగా ఉండాలని తన వివాహ జీవితాన్ని సైతం త్యాగం చేసి ఒంటరిగానే ఉండిపోయింది.

వారి ఆలనాపాలనా చూస్తూ, అనారోగ్యం పాలైనప్పుడు కంటికి రెప్పలా కాపాడుకుంది. చివరకు వారు తుదిశ్వాస విడిచినప్పుడు, కన్నకొడుకు కనీసం కడచూపునకు, అంత్యక్రియలకు కూడా రాకపోతే.. సునీత అంతా తానై ముందుండి నడిపించింది. అప్పులు చేసి మరీ శాస్త్రోక్తంగా వారి అంత్యక్రియలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించింది.

- కుటుంబం ఇచ్చిన భరోసా.. 11 ఏళ్ల హక్కుపై కుట్ర!

సునీత నిస్వార్థ సేవకు, త్యాగానికి చలించిపోయిన కుటుంబ సభ్యులందరూ కలిసి.. తాత పోలోజు ముసలయ్య పేరు మీద ఉన్న ఇంటిని (అసెస్‌మెంట్ నంబర్ 1-19) ఆమెకే చెందేలా అప్పట్లో నిర్ణయించారు. ఆమె భవిష్యత్తుకు భరోసాగా ఉండాలని భావించి, కుటుంబ సభ్యులంతా ఏకగ్రీవంగా సమ్మతి తెలుపుతూ సంతకాలు కూడా చేశారు. అప్పటి నుంచి గత 11 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ రికార్డుల్లో ఆ ఇల్లు రాసోజు సునీత పేరు మీదే కొనసాగుతోంది. ఆమె క్రమం తప్పకుండా ఇంటి పన్నులు చెల్లిస్తూ, ఆ చిన్న గూడునే తన ప్రపంచంగా చేసుకుని బతుకుతోంది.

కానీ ఇన్నేళ్ల తర్వాత ఆ ఒంటరి మహిళ నీడపై కొందరి కన్ను పడింది. గతంలో కన్నతల్లిదండ్రుల అంత్యక్రియలకు కూడా ముఖం చాటేసిన కుమారుడు పోలోజు బ్రహ్మచారి, ఇప్పుడు కొందరు స్థానిక రాజకీయ నాయకులు, అధికారుల అండదండలతో ఆ ఇంటిని కాజేయాలని చూస్తున్నారని సునీత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పంచాయతీ అసాధారణ తీర్మానం.. కోర్టుల పరిధిలో జోక్యం!

సివిల్ వివాదాలను, ఆస్తి హక్కులను తేల్చాల్సింది న్యాయస్థానాలు మాత్రమే. కానీ, గొల్లపల్లి గ్రామ పంచాయతీ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా, అసాధారణ రీతిలో వ్యవహరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 11 ఏళ్లుగా సునీత పేరుపై ఉన్న 1-19 అసెస్‌మెంట్‌లో లోపాలున్నాయంటూ కనీసం ఆమెకు గానీ, ఇతర కుటుంబ సభ్యులకు గానీ ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, సమగ్ర విచారణ జరపకుండానే ఏకపక్షంగా గ్రామ పంచాయతీలో తీర్మానం చేశారు. ఉమ్మడి ఆస్తిపై కుటుంబ సభ్యులందరికీ హక్కు ఉంటుందన్న కనీస న్యాయసూత్రాన్ని కూడా తుంగలో తొక్కి, కేవలం పోలోజు బ్రహ్మచారి ఒక్కడే హక్కుదారుడంటూ తీర్మానంపై ఆమోదముద్ర వేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాజకీయ నాయకుల ఒత్తిడితో అధికారులు హుటాహుటిన రికార్డులు మార్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని స్థానికులు సైతం చర్చించుకుంటున్నారు.

- కన్నీటి పర్యంతమవుతున్న సునీత.. న్యాయపోరాటానికి సిద్ధం

ఒకవైపు రికార్డులు మార్చే కుట్ర జరుగుతుండగానే, మరోవైపు ఎలాంటి గడువు, నోటీసులు ఇవ్వకుండా తక్షణమే ఇల్లు ఖాళీ చేయాలంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తనను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సునీత కన్నీరుమున్నీరవుతున్నారు. 'నా జీవితమంతా కుటుంబానికే ధారపోశాను. నా పెళ్లి, నా సంతోషాలు అన్నీ వదులుకుని తాత, అమ్మమ్మలకు సేవ చేశాను.

వారు చనిపోతే కన్నకొడుకు కూడా రాలేదు. నేనే అన్నీ దగ్గరుండి చేశాను. ఈరోజు నాకు దిక్కులేదని, ఒంటరి మహిళనని చూసి బయటి వ్యక్తుల ప్రమేయంతో నన్ను రోడ్డున పడేయాలని చూస్తున్నారు. నాకున్న ఒక్కగానొక్క ఆధారం ఈ ఇల్లు.. దీన్ని కూడా లాక్కుంటే నేను ఎక్కడికి పోవాలి?' అంటూ సునీత గుండెలవిసేలా రోదిస్తున్న తీరు అందరి హృదయాలను కలచివేస్తోంది.

ఎన్ని బెదిరింపులు ఎదురైనా తన హక్కుల కోసం పోరాడాలని సునీత నిశ్చయించుకున్నారు.

ఇప్పటికే ఈ అన్యాయంపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మహిళా కమిషన్ తలుపు తట్టారు. ఒంటరి మహిళను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వేధింపులపై ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా న్యాయవాది ద్వారా గ్రామ పంచాయతీ కార్యాలయానికి లీగల్ నోటీసులు పంపి, ఈ అక్రమ తీర్మానంపై తెలంగాణ హైకోర్టులో న్యాయపోరాటం చేసేందుకు సిద్ధమయ్యారు.

ప్రతీ ఇంటికి ఇందిరమ్మ జీవిత బీమా పథకం

ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ప్రతీ ఇంటికి ఇందిరమ్మ జీవిత బీమా పథకం ఈ నెల 19 నుండి రాష్ట్ర వ్యాప్తంగా అమలు అవుతుందని శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.మేడ్చల్ నియోజకవర్గం లో రెండో రోజు అయన పర్యటించారు. జిఎన్ఆర్ కన్వెన్షన్ అత్తివెల్లి లో కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్ల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందించిన పట్నం మహేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎంపీ ఈటెల రాజేందర్,కలెక్టర్ మనూ చౌదరి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్, ఎల్లంపేట చైర్ పర్సన్ శ్రీదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగారూ. 5 కోట్ల నిధులతో తూము కుంట ఇందిరమ్మ ఇళ్ల పరిసరాలలో వ్యర్థ, వర్షపు నీటి ప్రవాహ కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కీసర సర్కిల్ పరిధిలో దమ్మాయిగూడ లోని ఆర్ జీ కే కాలనీలో రూ. 5 కోట్ల నిధులతో వ్యర్థ, వర్షపు నీటి ప్రవాహ కాల్వల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని ఆదుకునే సదుద్దేశంతో ఈనెల 19 నుండి రాష్ట్రంలో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలవుతుందని, 18 – 59 ఏళ్ల వయసు మధ్య గల కుటుంబ యజమానికి రూ. 5 లక్షల బీమా పథకాన్ని ప్రభుత్వం అందించనుందని తెలిపారు.రాష్ట్రంలో కొత్తగా 4 లక్షల 63వేల మందికి చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని చెప్పారు.ఇందుకు ప్రభుత్వం ప్రతీ నెలా రూ. 114 కోట్లు బాధితుల కోసం భరిస్తుందన్నారు. మేడ్చల్ జి ల్లాలో కొత్తగా 25,553 చేయూత పింఛన్లు మంజూరవగా, నియోజకవర్గం 6,681మందికీ,ఉప్పల్ లో 4,278 మందికి, మల్కాజిగిరి లో 2,705 మందికి, కుద్బుల్లాపూర్ లో6,685 మందికి, కూకట్పల్లి లో 5,203 మందికి చేయూత పింఛన్లు మంజూరైనట్లు మహేందర్ రెడ్డి వివరించారు.ఇవే కాకుండా నిరు పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళను పంపిణీ చేస్తుందని మహేందర్ రెడ్డి చెప్పారు.

ఉచిత బస్సులతో మహిళలందరికీ గౌరవంగా రాష్ట్రమంతా తిరిగేలా అవకాశం కల్పించిందని మహేందర్ రెడ్డి అన్నారు.

కొత్త రేషన్ కార్డులు, రూ. 500 కే వంట గ్యాస్ అందించడం లాంటి సంక్షేమ పథకాలు ప్రతి నిరు పేదకు చేరిందని మహేందర్ రెడ్డి వెల్లడించారు.రాష్ట్రంలో ప్రతి నిరుపేద సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా విధానాలు సాగుతున్నాయని శాసనమండలి ప్రభుత్వం పచ్చి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మేడ్చల్ ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏదైనా పేదల సంక్షేమం కోసం కృషి చేసిదై ఉండాలని అన్నారు. రాజకీయాలలో పదవులు శాశ్వతం కాదని సంక్షేమం శాశ్వతం అని అన్నారు. రాష్ట్రప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వంమైన పేదల కోసం తపించాల్సిందేనని చెప్పారు. ఇంకను పెన్షన్ అందని వారందరికీ పెన్షన్ కల్పించాలని చెప్పారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ని నెర వేర్చుకునేలా పెన్షన్ 4000 అందించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతిపక్షాలను కలుపుకొని పోవాలని అన్నారు. కలెక్టర్ మనూ చౌదరి మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేలా తాము కృషి చేస్తున్నట్లు చెప్పారు. సమన్వయంగా పనిచేస్తే ప్రభుత్వ పథకాలని విజయవంతం అవుతాయని అన్నారు.



మెదడుకు వేసే సంకెళ్లను తెంచే ఆధునిక చికిత్స

హైదరాబాద్(ప్రశ్న న్యూస్) జాతీయ మూర్ఛ వ్యాధి దినోత్సవం సందర్భంగా నిన్న సికింద్రాబాద్ "మెడికవర్ హాస్పిటల్"లో ఏర్పాటు చేసిన సదస్సులో వైద్య నిపుణులు విలేకరుల సమావేశంలో వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు వెల్లడించారు. భారతదేశంలో దాదాపు కోటి పై చిలుకు మూర్ఛ సమస్యతో బాధపడుతున్నారు. చాలామంది మూర్ఛను ఒక శాపంగానో లేదా దెయ్యం పట్టిందని భావిస్తూ మూఢనమ్మకాలను నమ్ముతుంటారు,డాక్టర్ దగ్గరికి వెళ్లకుండా రోగాన్ని దాచిపెడుతుంటారు. అయితే మెదడులోని నాడీ కణాల మధ్య విద్యుత్ సంకేతాల ప్రసరణలో అకస్మాత్తుగా ఏర్పడే తీవ్ర అంతరాయమే మూర్ఛ వ్యాధికి మూలకారణం. వంశపారంపర్య లోపాలు, గర్భధారణ సమయంలో లేదా ప్రసవ సమపంలో మెదడు సరిగా అభివృద్ధి చెందకపోవడం లేదా ఆక్సిజన్ అందకపోవడం వంటి పుట్టుకతో వచ్చే సమస్యలు దీనికి దారి తీస్తాయి.అలాగే రోడ్డు ప్రమాదాలు లేదా ఇతర కారణాల వల్ల తలకు బలమైన గాయాలు తలగడం,బ్రెయిన్ ట్యూమర్లు వంటి ఇన్ఫెక్షన్లు మెదడు కణాలను దెబ్బతీస్తున్నాయి.వయసుతో తేడా లేకుండా వచ్చే పక్షవాతం లేదా మెదడులోని రక్తనాంకాలలో ఏర్పడే సమస్యల వల్ల కూడా కొందరిలో ఈ రుగ్మత తలెత్తే అవకాశం ఉందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మూర్ఛ రోగులను చూస్తే గతంలో భయంతో పరుగులు:

దేశంలో యాభై ఏళ్ల క్రితం

మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న రోగులు కోకొల్లలు.అయితే ఈ వ్యాధికి సంబంధించిన వ్యక్తులకు మెదలో "రాగి పల్లేం"వేసి ఉంచేవారు. అప్పట్లో ఈ వ్యాధితో రోగి ఇబ్బందులకు గురైనప్పుడు ఇంట్లో,వీధిలో గాని ఈ సమస్య తలెత్తుతే వేంటనే స్థానికులు ఇంటి తాళాలు చెతిలో పెట్టి,బిందెలతో వాళ్ళ పై నీళు ళ పోసెవారు.ఆక్రమంలో ఆ వ్యక్తి అరుపులు,కేకలతో కాళ్లు చేతులు కొట్టుకుంటూ, నోట్లో నుంచి లాలాజలం వదులుతూ,పళ్లు గట్టిగా కొరుకుతూ పెద్ద పెద్ద శబ్దాలు చేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేసేవారు.

మూర్ఛకు చెక్ పెట్టే ఆధునిక శస్త్ర చికిత్సలు..

సకాలంలో ఆధునిక వైద్య పద్ధతులను అందిపుచ్చుకుంటే రోగులు సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితాన్ని గడపవచ్చని సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ న్యూరో నిపుణులు స్పష్టం చేశారు.దేశవ్యాప్తంగా సుమారు కోటి మందికి పైగా మూర్ఛ వ్యాధితో ఇబ్బంది పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి,వీరిలో అధిక శాతం మందికి సాధారణ మందులతోనే వ్యాధి అదుపులోకి వస్తుందని,అయితే దాదాపు మూడో వంతు మంది రోగుల్లో మాత్రం రెండు రకాల నాణ్యమైన మందులను సరైన మోతాదులో వాడినప్పటికీ మూర్ఛ తగ్గదని వివరించారు.వైద్య పరిభాషలో దీనిని 'డ్రగ్ రెసిస్టెంట్ ఎపిలెప్సీ'గా పిలుస్తారని పేర్కొన్నారు. ఇలాంటి వారు కేవలం మందులు మారుస్తూ కాలయాపన చేయకుండా, న్యూరాలజీ,న్యూరోసర్జరీ నిపుణుల పర్యవేక్షణలో సర్జరీ ఉన్న అవకాశాలను పరిశీలించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



50 నుంచి 86శాతం వరకు సత్ఫలితాలు శస్త్ర

చికిత్సకు అర్హులైన రోగులను సరైన పద్ధతిలో ఎంపిక చేసి ఆపరేషన్ నిర్వహిస్తే,50 నుంచి 86 శాతం మందిలో మూర్ఛ పూర్తిగా నయమౌవడం లేదా అదుపులోకి వచ్చే అవకాశం ఉందని అంతర్జాతీయ అధ్యయనాలు రుజువు చేస్తున్నాయని వైద్యులు వెల్లడించారు.

వ్యాధి మూలాలను కచ్చితంగా గుర్తించేందుకు సాధారణ బ్రెయిన్ స్కాన్‌తో పాటు 'ఎపిలెప్సీ ప్రోటోకాల్ ఎంఆర్ఐ,'వీడియో ఈఈజీ' వంటి అధునాతన పరీక్షలు ఎంతో కీలకమని డాక్టర్లు ఈ సందర్భంగా తెలిపారు. అయితే,సర్జరీ కోసం వైద్య పరీక్షలు చేయించుకోవడం అంటే తప్పనిసరిగా ఆపరేషన్ చేయించుకోవాలని అర్థం కాదని,అది కేవలం రోగికి శస్త్రచికిత్స ఎంతవరకు ఉపయోగపడుతుందో అంచనా వేయడానికి మాత్రమేనని స్పష్టం చేశారు.అపోహలు వీడి ముందుకు రావాలి అప్పుడే మూర్ఛ వ్యాధి పై సమాజంలో నెలకొన్న అపోహలు,చిన్నచూపు కారణంగా బాధితులు తమ సమస్యను బయటకు చెప్పుకోవడానికి భయపడుతున్నారని వైద్యులు ఆవేదన వ్యక్తం చేశారు.చదువు,ఉద్యోగం, పెళ్లి విషయాల్లో ఇబ్బందులు ఎదురవుతాయనే ఆందోళనతో కుటుంబ సభ్యులు వ్యాధిని రహస్యంగా ఉంచుతున్నారని,దీనివల్ల చికిత్స మరింత ఆలస్యమవుతోందని పేర్కొన్నారు.

మూర్ఛ అనేది ఇతర అనారోగ్య సమస్యల్లాంటి ఒక సాధారణ వైద్యపరమైన రుగ్మత మాత్రమేనని, సమాజంలో దీనిపై ఉన్న అపోహలను తొలగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు.

ఈ అవగాహన కార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ వికాస్ అగర్వాల్,సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ రావు దూసా,సీనియర్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ రమేష్ శిఖుకొల్లి, కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ రోహిత్ రమేష్ వాడిఖాయేలతో పాటు ఆసుపత్రి సెంటర్ హెడ్ కృష్ణవేణి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రశాంత్ రెడ్డి పాల్గొని ప్రజలకు విలువైన సూచనలు అందించారు.

వినియోగంలో పారదర్శకత

లోపించడమే నీటి ఎద్దడికి కారణం

- కాలనీల్లో విచ్చలవిడిగా నీటి వృధా

-సామాన్యుల కేనా నీటి పొదుపు సూత్రాలు, మరి పరిశ్రమల మాటేంటి

-నీటి వినియోగం పై ప్రజల్లో అవగాహన పెంచాలి

- పరిశ్రమలకు విడుదలవుతున్న నీటి సరఫరా పై అధ్యయనం చేయాలి



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల తీవ్ర కరువు కోరల్లో చిక్కుకుని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎల్‌నినో కారణంగా వర్షాలు కురవకపోవడంతో జలాశయాల్లో నీటి నిల్వలు క్షీణించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. ఈ క్రమంలో నీటి పొదుపు పాటించాలని ప్రభుత్వం సూచిస్తుంది. అయితే నీటి పొదుపు పాటించాలనే నినాదం సరైనదే అయినప్పటికీ నీటిని పొదుపు చేయాల్సింది కేవలం సామాన్యుడేనా అనే సందేహం కలుగుతుంది. గత జూన్ నుంచి అక్టోబర్ వరకు తెలంగాణలో సాధారణ వర్షపాతం గణనీయంగా తగ్గింది. జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయితో పోలిస్తే గణనీయంగా తగ్గిపోయాయి. హైదరాబాద్ మహా నగరానికి త్రాగునీరు అందించే కీలకమైన సింగూరు జలాశయం పూర్తి సామర్థ్యంతో పోలిస్తే నిల్వలు అత్యల్ప స్థాయికి చేరాయి. దీంతో తాగునీటికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో నీటిని పొదుపు చేయాలని ప్రజలను కోరుతు, మరోవైపు భారీగా నీటిని వినియోగించే పరిశ్రమలకు ఎలాంటి ప్రమాణాలు లేకుండా నీటి సరఫరా చేయడం సమగ్ర నీటి విధానం ఎలా అవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక్కడ సమస్య పరిశ్రమలకు వ్యతిరేకత కాదు, నీటి వినియోగంలో పారదర్శకత లేకపోవడమే ప్రధాన కారణం. శుద్ధి చేసిన మురుగు నీటిని పరిశ్రమలు, డేటా సెంటర్లకు సరఫరా చేయడం వంటి ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోజురోజుకు క్షీణిస్తున్న నీటి లభ్యత దృష్ట్యా నీటి రహిత లేదా తక్కువ నీటి శీతలీకరణ సాంకేతికతలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. నీటి కరువు ప్రకృతి విపత్తు కావచ్చు. కానీ నీటి కొరతను తీవ్రం చేసే విధానపరమైన తప్పిదాలకు మనమే బాధ్యులం అవుతాం. అందుకే ఈ సంక్షోభ సమయంలో పొదుపు సామాన్యుడి బాధ్యత మాత్రమే కాదు, పరిశ్రమలు, ప్రభుత్వానిది కూడా అనే సూత్రాన్ని పాటించాల్సి ఉంది. ముఖ్యంగా నీటి ఎద్దడి ప్రాంతాల్లో ఎటువంటి పరిశ్రమలు ఉన్నాయి, ఇవి ఎంత నీటిని వినియోగిస్తున్నాయనే దానిపై అధ్యయనం చేయాల్సి ఉంది. అలాగే నీరు నదుల నుంచి వస్తోందా లేక భూగర్భ జలాల నుంచి వస్తుందా అనే వివరాలు ప్రజలను అందుబాటులో ఉంచేలా డేటా సెంటర్ల కేంద్రంగా హైదరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దడం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది అయితే, కొన్ని సంప్రదాయ శీతలీకరణ పద్ధతులు గణనీయమైన నీటిని వినియోగిస్తాయి. వాటి నీటి అవసరాలపై ముందస్తు ప్రణాళికల ప్రకారం నీటి లభ్యత ఆధారంగా నీటిని సరఫరా చేయడంతో కొంత మేరకు నీటి అవసరాలను తీర్చడానికి మార్గం సుగమం అవుతుంది.

కాలనీల్లో విచ్చలవిడిగా నీటిని నీటి వృథా

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న తరుణంలో నీటిని వృథా చేయడం తీవ్రరూపం దాల్చడంతో నీటి కష్టాలు మరింత పెరుగుతున్నాయి. దీనివల్ల తీవ్రమైన త్రాగునీటి ఎద్దడి ఏర్పడటమే కాకుండా, భూగర్భ జలాలు కూడా వేగంగా అడుగంటిపోతున్నాయి. ఈ సమస్యకు గల ప్రధాన కారణాలను అధ్యయనం చేసి నివారణ చర్యలు పాటించాల్సిన అవసరముంది.

నీటి వృథాకు ప్రధాన కారణాలు

పలు కాలనీల్లో చాలా ఇళ్లలో మోటార్లు ఆన్ చేసి మర్చిపోవడం వల్ల ట్యాంకులు నిండి గంటల తరబడి నీరు వృథాగా వీధుల్లో పారుతోంది. అలాగే బోరు మోటార్లు ఆన్ చేసి పైపుల ద్వారా నేరుగా నీటిని పట్టి బైకులు, కార్లు కడగడం, ఇంటి ముందు రోడ్లపై కడగడం వల్ల వందల లీటర్ల నీరు వృథా అవుతోంది. అలాగే ఇళ్లలో నల్లాలు (కుళాయిలు) సరిగ్గా కట్టకపోవడం, పైపులైన్లు దెబ్బతినడం వల్ల చుక్కచుక్కగా నీరు కారిపోతు పెద్ద మొత్తంలో నీటి నష్టం జరుగుతోంది. నీటి విలువ తెలియక, అవసరానికి మించి నీటిని వాడటం నేటి కాలంలో ఒక అలవాటుగా మారింది.

నీటి పొదుపు సూత్రాలు

ట్యాంక్ నిండగానే మోటార్ దానంతట అదే ఆగిపోయేలా సెన్సార్లు లేదా అలారాలను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉంది. వాహనాలు కడగడానికి మొక్కలకు నీళ్లు పోయడానికి నేరుగా పైపు వాడకానికి బదులు బకెట్లు మగ్గులను వాడాలి. కాలనీల్లో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు నీటి వృథాపై కఠిన నిబంధనలు పాటించాలి. నీటిని వృథా చేసే వారిని గుర్తించి నోటీసులతో పాటు జరిమానాలు విధించాలి.

ముఖ్యంగా ప్రతి ఇంటి యజమాని బాధ్యతాయుతంగా వ్యవహరించాలి వృథాగా పోయే వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేసేలా ప్రతి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. కాలనీల్లో ప్రధాన పైపులైన్లు పగిలి నీరు వృథా అవుతుంటే, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్రతరమవుచున్న నీటి కష్టాలకు సరైన ప్రణాళికాబద్ధంగా స్పందించి నీటి పొదుపు చర్యలు చేపట్టడంతో గట్టెక్కే అవకాశాలు మన చేతుల్లోనే ఉన్నాయని సత్యాన్ని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నాజరీన్ స్కూల్‌కు నిజమైన యాజమాన్యం ఎవరు.?

- ప్రభుత్వం గుర్తించిన కరస్పాండెంట్,,యజమాన్యం టీచర్లకు జీతాలు ఇచ్చే బాధ్యత లేదా.?

- మూడు నెలల నుండి జీతాలు రాక ఉపాధ్యాయులు ఇక్కట్లు

- పాఠశాల వ్యవహారాన్ని చట్టదిద్దాలని డిఈఓ, ఎం ఈ ఓ లకు విజ్ఞప్తి

- అనధికారికంగా ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ డిమాండ్

మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మేడ్చల్ జిల్లా ఎల్లంపేట మున్సిపల్ పరిధి డబ్బిల్ పూర్ గ్రామంలోని నాజరీన్ పాఠశాల పరిస్థితి రోజురోజుకు దిగజారుతుంది. ఈ పాఠశాల రికార్డులో ఉన్న అధికార యాజమాన్య వ్యక్తులు వేరు. స్కూలు ఫీజులు తీసుకుంటూ నడిపిస్తున్న వ్యక్తులు వేరు. రికార్డులో ఉన్న వ్యక్తులు కాకుండా అనధికారికంగా బాధ్యతలను చేపడుతూ తామే అసలైన యాజమాన్యం అంటూ విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తున్న వైనం ఇది. ఈ విషయంలో వెంటనే పోలీసులు స్పందించి అక్రమంగా విద్యార్థుల వద్ద ఫీజులు వసూలు చేసిన వారిపై కేసు నమోదు చేసి టీచర్లకు జీతాలు ఇప్పించాలి, రికార్డుల్లో ఒకరు ఉండి అనధికారికంగా మేనేజ్మెంట్ చేస్తున్న వ్యక్తులను వెంటనే స్కూల్ బాధ్యతలు నుండి తొలగించి వారిపై కేసు నమోదు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

నాజరీన్ పాఠశాల వివాదాల పుట్ట..

ఒకప్పుడు ప్రతిష్టాత్మకంగా నడిచిన నాజరీన్ పాఠశాల ప్రస్తుతం వివాదాల కు నిలయంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారికంగా ఉన్న యాజమాన్యం కాకుండాఅనధికారికంగా తామే అసలైన యాజమాన్యం అంటూ కొందరుపాఠశాల నిర్వహణ బాధ్యతలను అక్రమంగా చేతిలోకి తీసుకొని విద్యార్థుల నుండి ఫీజులను వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలకు సంబంధించిన రికార్డులన్నీ అధికారిక యాజమాన్యం వద్ద ఉండగా, అనధికారికంగా పాఠశాలను నిర్వహిస్తూ తామే అసలైన యాజమాన్యం అని చెప్పుకునే వ్యక్తుల వద్ద పాఠశాలకు సంబంధించిన ఎలాంటి రికార్డులు లేవని ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. మొదటి తరగతి నుండి పదో తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో విద్యార్థులకు సంబంధించిన అన్ని రికార్డులు అధికారిక యాజమాన్యం వద్ద ఉన్నాయని, అనధికారికంగా పాఠశాలను నిర్వహిస్తున్న యాజమాన్యం వద్ద ఎలాంటి రికార్డులు లేకుండా తామే అసలైన యజమానుల మంటూ డబ్బులను వెదజల్లుతో పాఠశాలను తన ఆధీనంలో ఉంచుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు అంటూ జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో అధికారిక యాజమాన్యం, అనధికారిక యాజమాన్యం సభ్యుల పై స్థానిక మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో కేసులు నమోదు సైతం అయ్యాయి. అయినా పాఠశాలలో మార్పు మాత్రం రాలేదు. ఈ వివాదాల వల్ల ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై చెడు ప్రభావం పడే అవకాశం ఉందని పేరెంట్స్ ఆందోళన చెందుతున్నారు. అక్రమంగా పాఠశాల నిర్వహణను సాగిస్తున్న వ్యక్తులపై ప్రజావాణిలో ఫిర్యాదులు సైతం వెళ్ళాయి.

డీఈవో, ఎంఈఓ ల మౌనం.?



నాజరీన్ పాఠశాలలో వ్యవహారం ముదురుతున్న

జిల్లా విద్యాధికారి కానీ, మండల విద్యాధికారి కానీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో జరుగుతున్న వివాదంపై డి ఈ ఓ కు, ఎంఈఓ కు పలుమార్లు ఫిర్యాదులు చేసిన సమస్యను పరిష్కరించేందుకు జిల్లా విద్యాధికారులు పట్టించుకోకపోవడం వలన పరిస్థితి మరింత ముదురుతుందని, దీనివల్ల ఇక్కడ చదువుతున్న దాదాపు 350 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని పేరెంట్స్ ఆందోళన చెందుతున్నారు. డీఈఓ కానీ, ఎంఈఓ కాలేజ్ స్కూలు సందర్శించి రికార్డులు అధికారికంగా ఎవరున్నారో గుర్తించి వారికి బాధ్యతలను అప్పగించాల్సి ఉండగా జిల్లా విద్యాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు అని పేరెంట్స్ ఆరోపిస్తున్నారు.



మా చేతిలో ఏమీ లేదు..

నాజరీన్ పాఠశాలలో జరుగుతున్న వివాదం విషయంలో మా చేతిలో ఏమీ లేదని అది మేనేజ్మెంట్ వివాదమని, జిల్లా విద్యాధికారులు చేతులెత్తేస్తున్నారు. మేనేజ్మెంట్ విషయంలో జరుగుతున్న వివాదం కావడం వల్ల పోలీసులకే ఫిర్యాదులు చేసుకోవాలని, ఇందులో విద్యాశాఖ అధికారులు ఏమి చేయలేరని చేతులు ఎత్తివేయడం విడ్డూరంగా ఉంది.

పోలీసులు సైతం సమగ్ర విచారణ జరపాలి..

నాజరీన్ పాఠశాలలో జరుగుతున్న వివాదంలో మేడ్చల్ పోలీస్ స్టేషన్ లో ఇరువర్గాల వారిపై కేసులు నమోదయ్యాయి. అయినానర్సరీన్ పాఠశాలలో ఎలాంటి మార్పులు రాలేదు. ఇంకా పరిస్థితి ముదురుతున్న దృష్ట్యా పోలీసులు సమగ్ర విచారణ జరిపి రికార్డులో అధికారికంగా ఉన్న యాజమాన్యం ఎవరు, అనధికారికంగా ఉన్న యాజమాని ఎవరో గుర్తించి సమస్యను పరిష్కరించాలని, లేని పక్షంలో ఈ పాఠశాలలో పరిస్థితులు మరింత దిగజారి ప్రమాదం ఉందని, దాదాపు 350 మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్య తయారీ అవకాశముందని, ఇప్పటికే ఈ సంస్థకు సంబంధించిన కాలేజీ మూతపడిందని, ఇదే బాటలో పాఠశాల సైతం మూతపడే ప్రమాద ఏర్పడే అవకాశం ఉందని పేరెంట్స్ పేర్కొంటున్నారు. పాఠశాలలో నెలకొన్న వివాదం పై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని పేరెంట్స్ మేడ్చల్ పోలీసులను కోరుతున్నారు.

రాజీవ్, సోనియాల అనుబంధంపై వ్యాఖ్యలు

- రాహుల్ గాంధీ కౌంటర్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తల్లిదండ్రులైన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ, సోనియా గాంధీల మధ్య ఉన్న అనుబంధంపై తాను చేసిన వ్యాఖ్యలపై వచ్చిన విమర్శలకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ప్రేమను వ్యక్తపరచడం, అనుభవించడం అనే అంశంపై ఆయన ఒక రాజకీయ ప్రకటనను విడుదల చేస్తూ, దానికి సంబంధించి ఒక ఆలయ శిల్పం ఫొటోను జతచేశారు. సోనియా గాంధీ జీవిత అనుభవాలతో రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సోమవారం రాహుల్ గాంధీ ప్రసంగించారు. ఈ సందర్భంగా తన తల్లిదండ్రుల మధ్య ఉన్న ప్రేమానురాగాలను ఆయన గుర్తుచేసుకున్నారు. భోజనం చేసే ప్రతిసారీ తన తండ్రి రాజీవ్ గాంధీ ఒళ్లో తల్లి సోనియా గాంధీ కూర్చునేవారని రాహుల్ పేర్కొన్నారు. "ప్రతి రోజూ భోజన సమయంలో నాన్న ఉండేవారు, నాన్న ఒళ్లో అమ్మ కూర్చునేది" అని రాహుల్ అనడంతో, వేదికపై ఉన్న సోనియా గాంధీ కాస్త ఇబ్బందిగా నవ్వారు. సాధారణంగా ఇతర కుటుంబాల్లో ఇలాంటి దృశ్యాలు కనిపించవని ఆ తర్వాత తనకు అర్థమైందని, చిన్నతనంలో ఇది సాధారణ విషయమే అనుకుని ఒక స్నేహితుడిని వారి తల్లిదండ్రుల గురించి కూడా అలాగే ప్రశ్నించానని రాహుల్ వివరించారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో పెద్దఎత్తున విమర్శలు, చర్చలు మొదలయ్యాయి. ఈ పరిణామాలపై స్పందించిన రాహుల్ గాంధీ, మంగళవారం 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు. పవిత్ర నందిపై శివపార్వతులు కలిసి ఆసీనులైనట్లు ఉన్న ఒక పురాతన ఆలయ శిల్పం చిత్రాన్ని ఆ పోస్ట్‌కు జతచేశారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పందిస్తూ "బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో భయం, కోపం, విద్వేషం గూడుకట్టుకున్నాయి. అవి వారిని ప్రేమను అనుభూతి చెందకుండా, వ్యక్తపరచకుండా అడ్డుకుంటున్నాయి. ఒక నిజమైన హిందువుగా వారిని ఈ వలయం నుంచి విముక్తులను చేయడం నా బాధ్యత. తద్వారా వారు కూడా తమ జీవితాల్లో అద్భుతమైన ప్రేమ, అనుబంధాల సౌందర్యాన్ని, ఆనందాన్ని అనుభవించడం ప్రారంభిస్తారు, సత్యం శివం సుందరం" అని పేర్కొన్నారు.

ఏపీకి తుపాను ముప్పు.. ప్రజలు అప్రమత్తం

- అక్వాన్ తుపానుపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్



అమరావతి (ప్రశ్న న్యూస్) బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తుపాను తీరం దిశగా దూసుకువస్తున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను తీవ్రత, కదలికలు, ముందస్తు జాగ్రత్తలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. తాజా పరిస్థితులను సమీక్షించిన సీఎం, విపత్తు నిర్వహణ విభాగంతో పాటు తీరప్రాంత జిల్లాల యంత్రాంగాన్ని పూర్తిగా అప్రమత్తం చేశారు. వాతావరణ శాఖ వివరాల ప్రకారం ప్రస్తుతం అక్వాన్ తుపాను చెన్నైకి 610 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 660 కిలోమీటర్లు, విశాఖపట్నానికి 670 కిలోమీటర్లు, ఒడిశాలోని గోపాల్‌పూర్‌కు 790 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 19, 20 తేదీల్లో విస్తారంగా భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు సీఎంకు వివరించారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారాన్ని, హెచ్చరికలను పంపేందుకు పటిష్ఠమైన సమాచార వ్యవస్థను అందుబాటులో ఉంచాలని చంద్రబాబు ఆదేశించారు. ఇందులో భాగంగా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బందిని క్షేత్రస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. సిబ్బంది నేరుగా ప్రజల వద్దకు వెళ్లి తుపాను ముప్పుపై అవగాహన కల్పించాలని, అవసరమైన రక్షణ చర్యలపై వారికి సమాచారం అందించాలని ఆదేశించారు. సముద్రం అల్లకల్లోలంగా మారే సూచనలు ఉండటంతో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

మోదీ చాలా 'టఫ్ మ్యాన్'

- క్వాడ్ వేదికగా భారత ప్రధానిపై ట్రంప్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఫిలిప్పీన్స్‌లోని మనీలా వేదికగా జరిగిన క్వాడ్ దేశాల సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండేళ్ల తర్వాత, ఆసియాన్ సదస్సు సందర్భంగా జరిగిన ఈ భేటీలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాధినేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీని 'టఫ్ మ్యాన్' (చాలా గట్టి వాడు)గా అభివర్ణించారు. గతంలోనూ పలు అంతర్జాతీయ వేదికలపై మోదీ 'టఫ్ నెగోషియేటర్', తనకంటే చాలా బెటర్ అని ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో క్వాడ్ భాగస్వామ్యాన్ని ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన కూటమిగా ట్రంప్ అభివర్ణించారు. భవిష్యత్ సాంకేతికతకు దిశానిర్దేశం చేసేందుకు 85 మిలియన్ డాలర్ల నిధులతో ప్రత్యేక 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యాక్సిలరేటర్'ను ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా సముద్ర జలాల్లో నియంత్రణ సామర్థ్యాలను పెంచేందుకు నాలుగు దేశాలు కలిసి త్వరలోనే ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తాయని స్పష్టం చేశారు. రేర్ ఎర్త్ (అరుదైన ఖనిజాలు) ఉత్పత్తిని పెంచడంలో అమెరికాతో పాటు భారత్, జపాన్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, రాబోయే 10 నెలల్లో తమకు అవసరమైన అన్ని వనరులు సమకూరుతాయని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. చైనా పర్యటనలో భాగంగా జిన్‌పింగ్, పుతిన్‌లతో త్రైపాక్షిక అణు చర్చలు జరిపి ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు ప్రయత్నిస్తానని ట్రంప్ వెల్లడించారు. ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో భేటీకి అవకాశం ఉందని, ఇరాన్ అణ్వాయుధాలు సాధించకుండా గట్టి నిఘా ఉంచామని తెలిపారు. మరోవైపు, ఎన్విడియా జాతీయ భద్రతా ప్రతిపాదనను స్వాగతిస్తూనే, ఇటీవల రాజీనామా చేసిన జెన్సన్ హువాంగ్ తిరిగి కంపెనీ సీఈవోగా బాధ్యతలు చేపడితే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొన్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588